సఫర్ హిజ్రీ శకం 1434

AL - HiLaL

# నెలవంక

మాస పత్రిక

Vol 8, Issue: 63  JANUARY - 2012

مجلة الهلال (باللغة التلغوية) – ملحق مجلة البشرى



## రండీ! ఓ నూతన అధ్యాయానికి నాంది పలుకుదాం!!

IPC
لجنة التعريف بالإسلام
ISLAM PRESENTATION COMMITTEE
جمعية النجاة الخيرية

جمعية النجاة الخيرية

**అల్లాహ్‌పై విశ్వాసం** - విశ్వాసులు తప్పకుండా కృతార్థులవుతారు.

**నమ్రత నిండిన నమాజు** - వారు తమ నమాజులో ఎంతో అణకువ, నమ్రతలు పాటిస్తారు.

**చెడుకి దూరంగా మసలుకోవడం** - పనికిమాలిన విషయాలకు చాలా దూరంగా ఉంటారు.

**విధుల చెల్లింపు** - తమ సంపద నుండి జకాత్ చెల్లిస్తారు.

**ఆత్మ నిగ్రహం** - వారు తమ మర్మావయవాలు కాపాడుకుంటారు. (అంటే వ్యభిచారం, తదితర అశ్లీల చేష్టలకు పాల్పడరు)

**నీతి, నిజాయితీ** - వారు తమ అప్పగింతలు, ప్రమాణాలు, ఒప్పందాల విషయంలో నిజాయితీగా వ్యవహరిస్తారు.

**క్రమ శిక్షణ** - తమ నమాజులను క్రమం తప్పకుండా, నియమ బద్ధంగా పాటిస్తారు.

అలాంటివారే మహోన్నత స్వర్గానికి (జన్నతుల్ ఫిర్‌దౌస్‌కి) వారసులవుతారు. అక్కడే వారు కలకాలం (హాయిగా) ఉంటారు. (మోమినూన్: 1-11)



# స్వర్గ అధిరోహణ మార్గాలు


NELAVANKA
సామాజిక, సాంస్కృతిక, సందేశాత్మక మాస పత్రిక

AL-HILAL
నెలవంక

(AL-HILAL MONTHLY)

Vol 8, ISSUE: 63
JANUARY 2012

CHIEF PATRON
Muhammad Ismail Ansari

GENERAL SUPERVISION
Khalid Al-Sab'a

EDITOR
Syed Abdus Salam Omeri

ASSOCIATE EDITOR
Sk. Habeebur Rahman Jamaee

EDITORIAL BOARD
Sk. Abdus Salam Omeri
Sk. MOHAMMED SALEEM JAMAEE
Sk. Muhammad Bilal
Tahera Begum

PHONE
Syed Abdus Salam Omeri
97248933

FAX
22400057

P.O.BOX: 1613
SAFAT-13017, KUWAIT

PUBLISHED BY
Islam Presentation Committee
Kuwait
www.ipc.org.kw

DESIGN
Nader Belal

www.zukhruf.net
Tel. 99993072


## ఈ సంచికలో....



**సుభిక్షం - దుర్భిక్షం**



**మీ ప్రభువు వైపునకు మరలండి**



**పాకశాల - కువైటీ వంటకాల పాఠశాల**

*స్నేహ కోరికను మనం పాలతో పోల్చవచ్చు. అవతలి వ్యక్తి ఇచ్చేది పంచదార అయితే మనలో కలిసిపోతుంది. ఉప్పు అయితే మనల్ని విరగ్గొడుతుంది. పెరుగైతే మన అస్థిత్వాన్ని మారుస్తుంది. నీరయితే పలుచన చేస్తుంది. కనుక మన పాలు ఎవరి పాలువ్వాలో మనమే నిర్ణయించుకోవాలి.*



**గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు!**


| | | | |
|---|---|---|---|
| కాలం పరిణామశీలం | 2 | ఇస్లాం శిక్షణ | 12 |
| మధురమైన మాట | 3 | నెలవంకకు సంబంధించిన సర్వే | 13 |
| సుభిక్షం - దుర్భిక్షం | 4 | రుచి - అభిరుచి | 14 |
| రక్తం జీవాన్నిచ్చే ద్రవం - 2 | 6 | ప్రవాసాంధ్రులకు | 15 |
| మీరు విజేత కాగలరు! | 8 | ఐపిసి వార్తలు | 16 |
| మీ ప్రభువు వైపునకు మరలండి | 10 | అవి ఇవి | 19 |
| | | నెలవంక ఉత్తరాలు | 20 |

احداث 2011 - قول مفيد - النعمة والنقمة - مكانة الدم في الجسم - كن ناجحاً - إرجع الى ربك - تربية المهتدين - استبيان للمجلة - الطبخ الكويتي - الثقافة الكويتية - اخبار اللجنة - رسائل الهلال

# కాలం పరిణామశీలం

కాలమనే కడలిలో మరో కెరటం లేచింది. మానవ చరిత్ర మరో మైలు రాయి దాటింది. చరిత్రలో ఏ సంవత్సరానికా సంవత్సరం ప్రత్యేక ప్రాధాన్యత కలిగి ఉంటుంది. కొత్తదనం అంటే చిత్తానికి ఎప్పుడూ ఉత్తేజమే. పాత జ్ఞాపకల స్థానంలో రానున్న భవిష్యత్తును ఊహించుకుంటూ రాబోయే సమయం సంతోషంగా గడవాలని కోరుకుంటాడు మనిషి. ఉషాకాంతుల వంటి పసిడి కలలతో మిసిమి భవితవ్యానికి సుస్వాగతం పలికే సంప్రదాయం వెనుకున్న రహస్యం - మనిషి నిత్య ఆశావాది కావడమే! ఆ ఆశావాదమే అడవి మనిషిని అణు అధికారిగా మార్చింది. ఎదురుదెబ్బలెన్ని ఎదురైనా అదరక, బెదరక సమస్యల సునామీలకు ఎదురీగి మరీ దూసుకుపోయే సుగుణమే మనిషిని ఇతర జీవరాసులలో శ్రేష్ఠుణ్ణి చేసింది. శిశిరం వస్తుంది, పోతుంది, మళ్లీ వస్తుంది. అయినా వసంత పవన తాకిడికే పరవశించిపోతుంది కోయిల. మధు మాసం రాగానే మావి చిగురు కొమ్మ మీద చేరి రాగాలాపన చేస్తుంది. అలాగే గత అనుభవాలు ఎలా ఉన్నా - రాబోయే కాలమంతా సర్వే జనా సుఖినోభవంతు, సర్వ జనావళికి శుభాలే కలగాలని మనసారా ఆపేక్షించడం ఒక్క మనిషికే చెల్లింది. అయితే 2011లో ఈ మనిషి చేసిందేమిటి? అంటే, 'పతనంతో పోరాటం' అనక మానదు.

పోరాటం - అది అరబ్బు ప్రపంచంలో నియంతలపై సాగిన ఆగ్రహ జ్వాలలే కావచ్చు. మళ్ళీ నిరాయుధ ప్రజలను గురి పెట్టి చూసిన కరకు మర తుపాకులే కావచ్చు. మళ్లీ మళ్ళీ శాంతి కపోతాల రక్తాన్ని చవి చూసిన ఇనుప మూతి కాకులే కావచ్చు. ఐరోపాలో ఆర్థిక సంక్షోభంపై సమరమే కావచ్చు. అమెరికాలో పెరుగుతున్న ఆర్థిక అంతరాలపై (ప్రభుత్వం ఆదుకోవాల్సింది ఒక శాతం ఉన్న వాల్ స్ట్రీట్‌ను కాదు. 99 శాతం ఉన్న మెయిన్ స్ట్రీట్‌నంటూ ఉద్యమించిన) యువ నిరసనలే కావచ్చు. భారత దేశంలో 2జీ, 3జీ, సీడబ్ల్యూజీ అవినీత రొంపిపై సాగిన ప్రతిఘటనే కావచ్చు. సామ్రాజ్యవాదులను సమస్యల్లోకి, సామాన్యులను కష్టాల్లోకి నెట్టిన, ముంచుతున్న ఆర్థిక సంక్షోభమే కావచ్చు. వెరసి 2012 వీటికి ఓ పెను సవాల్!

ఏది ఏమైనా, కాలం - దాని విలువ అమూల్యం. అది కలిమితో కొనలేనిది, బలిమితో వశపర్చుకోలేనిది. ఒక్కసారి చేజారితే తిరిగి సంపాదించుకోలేనిది. మ్రొక్కి పట్టుకోలేనిది, వెతికి వెనక్కి తెచ్చుకోలేనిది. నియతి తప్పక నడిచే ఆ కాలం మనిషికిచ్చే సందేశం - శిశిరంలో సయితం వసంతాన్నే కలగనమని. గతి తప్పిన చోటు నుంచే మతి మార్చుకుని మసలుకోమని. మానవ జాతికి ఊపిరి స్వాతంత్ర్యం - అది జ్యోతిగా వెలిగే చైతన్యం - ఆ చైతన్యం నిలిచిన నాడే సమస్త జగతికి సౌభాగ్యం అని. శిఖరంలా ప్రతి మనిషీ శిరసెత్తిన నాడే, అవనీ ఆకాశం, సూర్య చంద్ర నక్షత్రాల్లా ఆ సర్వేశ్వరుడికి తల వంచిన నాడే, జల నిధిలా ప్రతి హృదయం అలలెత్తిన నాడే మానవ జీవన గమనంలో మాయని వెలుగుల మహోదయం అని. అది గతాన్ని సింహావలోకనం చేసుకుని బంగారు భవిష్యత్తుకు దైవవిధేయతా పునాదులు వేసుకోవడంతోనే సాధ్యమని.

"కాలం సాక్షిగా! నిశ్చయంగా మానవుడు నష్టంలో పడి ఉన్నాడు. అయితే విశ్వసించి, సత్కార్యాలు చేసినవారు, పరస్పరం సత్యం గురించి ఉపదేశించినవారు, ఒండొకరికి సహనం (స్థయిర్యం) గురించి తాకీదు చేసిన వారు మాత్రం నష్టపోరు". (అల్ అస్ర్: 1-3)





శాంతి ప్రియ

# మధురమైన మాట

నేటి యువతరంల్లో నానాటికీ అభద్రతా భావం అధికమైపోతూంది. అలాగే వయసు మీద పడిందని మదనపడే పెద్దలకీ కొరవ లేదు. ఇట్టి పరిస్థితుల్లో ఒకరి సమక్షంలో వారు ఆనందంగా గడపడానికీ, వారి మనోభావాలను వ్యక్తపరచడానికి, వారి ఫీలింగ్స్‌ని చెప్పుకోవడానికీ, **'నీకు నేనున్నాను'** అన్న ఫీలింగ్ కలగటానికీ నిజమైన హితుడి ప్రాణ మిత్రుడి అవసరం ఉంటుంది. ఇలా పిల్లల నుంచి పెద్దల వరకు, యువకుల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ స్నేహాన్నే కాంక్షిస్తారు. ఆ స్నేహ కాంక్షని మనం పాలతో పోల్చవచ్చు. అవతలి వ్యక్తి ఇచ్చేది పంచాదార అయితే మనలో కరిగిపోతుంది. ఉప్పయితే విరగ్గొడుతుంది. పెరుగయితే మన అస్థిత్వాన్ని మారుస్తుంది. నీరయితే పలుచన చేస్తుంది. కనుక మన పాలు ఎవరి పాలవ్వాలో మనమే నిర్ణయించుకోవాలి. **'నేను చాలా ఒంటరిని నాకంటూ ఎవరూ లేరు. ఎవరూ నన్ను అర్థం చేసుకోరు. అందరితో నేను కలవలేక పోతున్నాను.'** అన్న దుర్భర స్థితి నుంచి ముందు బయట పడాలి.

ఇక వృద్ధుల విషమంటారా..! నిజంగా పరిశీలించి చూస్తే అసలైన జీవితం నలభై సంవత్సరాల తర్వాతే ప్రారంభమవుతుంది. ఇందుకు గొప్ప ఉదాహరణ ప్రవక్తలకు, ప్రవక్త పదవి 40 ఏండ్ల తర్వాత ప్రసాదించడమే. సగం జీవితం - ఇచ్చిన అనుభవ పరంపర నుంచి సరికొత్త జీవితం ప్రారంభించాలి. ఆ వయసు దాటాక జీవితం కాటికి కాలుజాచి ఉంటుందనుకోవటం మూర్ఖత్వం. నిజంగా ఆ వయసు నుంచే కొత్త జీవితం ప్రారంభమవుతుంది అని అనుకుంటే ఆ సరికొత్త జీవితం మరింత ఆనందప్రదంగా ఉంటుంది. వృద్ధాప్యం వయసుకే గానీ, మనసుకీ కాదని తెలుసుకోవాలి. మనిషి ఒంటరి తనానికి, అశాంతికి, అసంతృప్తికి బద్ధ శత్రువకటుంది. అది 'వ్యాపకం'. ఒక మంచి వ్యాపకం మనిషి జీవితంలో కొత్త ఉత్సాహాన్నిస్తుంది. అర్థం చేసుకోగలిగితే, ఒక పుస్తకం, లేద ఒక గొప్ప వ్యక్తి చరిత్ర మనకి ప్రేరణ ఇస్తుంది. **'ఇలా చెయ్యి'** అని శాసించకుండా ఎలా చేస్తే బావుంటుందో సలాహా ఇస్తుంది.

నేను, నా జీవితం, నా చదువు, నా ఉద్యోగం, నా కుటుంబం, నా బ్యాంక్ బ్యాలెన్సు అనుకుంటే నూతిలోని కప్పకీ ఒడ్డునున్న మనిషికీ తేడా ఏం ఉంటుంది చెప్పండి. కనుక జీవితం నిరాసక్తంగా అనిపించినప్పుడు ఒంటరితనంతో సతమతమైపోయే బదులు రోజుకో గంట, వారానికో రోజు, నెలకో నాలుగు రోజులు, ఏడాదికో యాభై రోజులు మనకంటు ఓ గుర్తింపునిచ్చిన సమాజం కోసం కేటాయించినప్పుడే జీవితానికి సార్థకత. సమాజ సేవ చేసినంత సేపూ ఇష్టంగా చేయండి. అందులో మమేకమైపోండి. ఆ శ్రమలో కష్టం ఉండదు. అసలట అసలే అన్పించదు. ప్రతిఫలాన్ని కోరుకోం కాబట్టి ఆశా నిరాశలుండవు. ఎవరో నెత్తిన కూర్చొని ఆజమాయిషీ చేస్తున్న భావనే కలుగదు. ఆ అదృష్టం సేవకులకే దక్కుతుంది. పరిమితమైన అనుభావాలతో, పరిమితమైన వ్యక్తుల మధ్య బతికే బతుకు, జైలు జీవితం కంటే ఎక్కువేం కాదు. మన ఇల్లు, మన కుటుంబం, మన స్నేహితులు...అంతా ఇతుకిరుగా ఉంటుంది. బయటికెళ్తే బోలెడంత ప్రపంచం. ఓ కవి అన్నట్టు

**ఓ ఫూల్ సర్ చడా జో చమన్‌సే నిక్‌లా'**
**ఇజ్జత్ ఉసే మిలీ జో వతన్‌సే నిక్లా.**

మనిషికైనా, మరే మహాత్ముడికైనా గడప దాటాకే బుద్ధి వికసించింది.

ఒంటరితనంతో బాధ పడుతున్న వారికీ, డిప్రెషన్ లాంటి సమస్యలు వేధిస్తున్న వారికి సృష్టిరాసుల సేవకు మించిన చికిత్స లేదు అంటున్నారు మానసిక నిపుణులు. అంత మంది కోసం పని చేస్తున్న ప్పుడు ఒంటరి భావనకు చోటెక్కడిది చెప్పండి. మనిషి ఎదుర్కొనే మానసిక సమస్యలకు బంధాల్ని మించిన, స్నేహపరా మర్శలకు మించిన మందేముంటుంది చెప్పండి. పైగా సమయాన్ని సృష్టి సేవ కోసం కేటాయించేవారు, మిగతావారికన్నా ఆరోగ్యంగా ఉంటారనీ, వారి ఆయుష్షు పెరుగుతుందిని, వారి సంపాదనలో శుభం కలుగుతుందిని ప్రవక్త (స) వారి పలు ప్రవచనాల ద్వారా రూడీ అవుతుంది. నిజమే మనకు బాగా ఇష్టమైన పని చేస్తున్నప్పుడు ఒత్తిడి ఉండదు. మనసు సేద తీరుతుంది. గుండే సాఫీగా పని చేస్తుంది. రక్తపోటు నియంత్రణలో ఉంటుంది.

అలాగే భరించలేని దిగులు ఆవరించినప్పుడు ప్రవక్త(స) గారి **"యా బిలాల్ అరిహ్‌నా బిస్సలాత్"** (ఓ బిలాల్! మాకు నమాజు ద్వారా విశ్రాంతినివ్వు) అన్న మాటను అనుసరిస్తూ, తాగుడికి ఇతర వ్యర్థ వ్యసనాలకి బానిసకాకుండా, మస్జిదుకు వెళ్ళటం, దైవ సన్నిధిలో సజ్దా చేయటాన్ని అలవాటు చేసుకోండి. మరీ బోరుగా ఉన్నప్పుడు సిగరెట్ తాగాలనిపించటం, చుట్ట పీల్చాలనిపించడం ఒక హానికర వ్యసనమైతే, మంచి స్వరం గల ఖుర్ఆన్ పారాయణాన్ని, పరలోక భీతిని పెంచే హితబోధనం వినడం అలవాటు చేసుకోండి. ఎందుకంటే ..?

చెడ్డ వ్యసనం మనల్ని అధిగమించి ఎంతగా తన చెప్పు చేతలలో ఉంచుకొంటుందో, మంచి అలవాటు ఒక స్నేహితునిగా, మన పక్కన చేరి, మనతో పాటు ఉండి స్ఫూర్తినిస్తుంది. అందుకే ఒక ప్రముఖ మేధావి ఇలా అన్నాడు: (1) ఒక మంచి ఆలోచనకి అంకురంగా వెయ్యండి. ఒక స్ఫూర్తి మొలక పైకొస్తుంది. (2) ఒక స్ఫూర్తి మొలకని అంటు కట్టండి. ఒక చర్య పుష్పిస్తుంది. (3) చర్య అనే పుష్పాన్ని ఫలించనివ్వండి. అలవాటు అనే ఫలం పక్వానిని కాస్తుంది. (4) ఆ ఆరాధన (అలవాటు) అనే ఫలాన్ని ఆస్వాదించండి. అది మీకు లక్ష్యం చేరుకొనే శక్తినిస్తుంది.

అబుల్ హసన్

# సుభిక్షం - దుర్భిక్షం

సకలలోక సృష్టికర్త అయిన అల్లాహ్ మనిషికి మహీతలంపై తన మనుగడ సవ్యంగా సాగించేందుకు కావాల్సి, ఒనరుల్ని, అవసరమైన వసతులను అతను అడగకుండానే ప్రసాదించాడు. సృష్టిలో సృష్టికర్త చేసిన లోటు ఏమి లేదు. సకల సౌఖ్యాలను మనిషికి ప్రసాదించి అతన్ని సమస్త జీవరాసులలో ప్రవరుఁనిగా చేసి నిలబెట్టాడు. అయితే మనిషి తనకు ప్రాప్త మయి ఉన్న మహోన్నత స్థానాన్ని కాపాడుకోలేక పోయాడు. ఇది అతని తప్పు. తన స్వార్థం కోసం, తన స్వయ ప్రయోజనాల కోసం నాకంలా ఉన్న ఈ 'నర' లోకాన్ని ఒక ప్రయోగశాలగా, ఒక మారణహోమంగా మార్చి 'నరక కూపం' లాంటి చేదు అనుభూతిని మిగిల్చాడు. సకల విధమైనటు సౌకర్యాలతో, దేవుని అనుగ్రహాలతో సుభిక్షంగా ఓలలాడుతున్న అవనీతలాన్ని అపాయం పాల్జేసి దయనీయ దుర్భిక్ష స్థితికి గురి చేశాడు. ఈ పాపం మనిషిది. ఈ విపర్యాసం దుర్గర్వ దానవుడు చేసినదే. అవును, ఈ దుర్భిక్ష స్థితి ప్రకృతి చేసినది ఎంత మాత్రం కాదు. దేవుడు చేసినది అంతకన్నా కాదు. ఇదంతా నరుడు చేసినదే, దుర్మార్గ మానవుడు చేసినదే. కాబట్టి ఈ దుస్థితిని చక్కదిద్దాల్సిన బాధ్యత కూడా నరులపైన మనందరి మీద ఉంది. అందు కోసం కనీస సామాజిక స్పృహ మనకు అవసరం. ఈ వ్యాసం ఆ కార్యసిద్ధిలో కొంత వరకైనా దోహద పడగలదని నమ్మకం. - ఉదయ భాను

బస్సుల్లో, బజార్లల్లో, బస్తీల్లో, పుణ్యక్షేత్రాలలో,హొటళ్ల ముందు, అంగళ్ల దగ్గర....ఎక్కడ చూసినా కనబడతారు అవసరార్థులు. ముష్టివాళ్లు, అడుక్కుతినేవాళ్లు అని వీరిని నామకరణం చేసి తామేదో డిక్షనరీలో లేని కొత్త పదాన్ని కనుక్కున్నామంతగా సంబర పడిపోతూ ఈ బలహీనుల్ని తస్కరించడం కూడా మనం గమనిస్తూనే ఆదేదో మనకు సంబంధం లేని విషయంగా దాటి వెళ్లిపోతుంటాము. వారు మా (నవ) లోకానికి చెందినవారు కానట్టుగా ఉపేక్షిస్తూ ఉంటాము. అవసరం ఏదీ లేకపోయినా, ఆస్తులుపాస్తులు మస్తుగా ఉన్నా, దేశాల మీద ఏదోక సంస్థ పేరుతో, సేవ పేరుతో తన పబ్బం గడుపుకోవడానికి అడక్కునేవాళ్లను భిక్షగాళ్లన్నా, ముష్టెత్తుకు బ్రతికేటోళ్లన్నా చెల్లుతుంది. అంతేగానీ, పూట గడవక, కడుపు మంట చల్లార్చుకొవడం కోసం పిడికెడు అన్నం అడిగేవారిని భిక్షగాళ్లని, ముష్టివాల్లని అనడం ఎంత మాత్రం సబబు కాదు. నిజంగా వారు ఆడుగుతున్నది భిక్షం కాదు; మన మీద వారికున్న కనీస హక్కును వారు అడుగుతున్నారు. ఇదే విషయాన్ని ఖుర్ఆన్ ఇలా సెలవిస్తున్నది: **"వ ఫీ అమ్వాలిహిమ్ హక్కుల్ లిస్సాయిలి వల్ మరహూమ్". వారి సంపదలో నిర్ణీత హక్కు ఉంటుంది. అడిగేవారికి, అడగనివారికి (అవసరం ఉండి కూడా ఆత్మాభిమానం వల్ల అడగనివారు, ప్రకృతి వైపరీత్యాలు తారసపడి సర్వస్వాన్ని కోల్పోయినవారికి) కూడా.** (నూహ్: 24,25)

నిజమే; కాలూ చెయ్యీ బాగుండి, సంపాదించే శక్తి ఉండి కూడా కొందరు ఈ యాచకుల వర్గంలో మనకు తారసపడతారు. అంతమాత్రాన తొందర పడి వారిని సోంబేరులుగానో, పని దొంగలుగానో ఖరారు చేసెయ్యడం సబబు కాదు. **'యాచకుడు మీ వద్దకు ఒంటె మీద స్వారీ అయి వచ్చినా మీరతనికి ఇవ్వండి'** అని ప్రవక్త (స) వారి మాట ప్రకారం మనం చేయగలిగిన సహాయం మనం చేయాలి. అంతేగాని, ఒక రూక కూడా ఇవ్వకుండా, ఒక్క ఈక కూడా విదిలించకుండా యాచకుణ్ణి నిందించే హక్కు మనకు లేదన్న విషయాన్ని మనం గ్రహించాలి. ఒకవేళ మనం అనుకున్నదే నిజమయినా, అప్పుడు కూడా మనమెంతో సౌమ్యంగా వ్యవహరించి సమస్యకు తగిన పరిష్కారాన్ని సూచించగలిగతే, వారు చెయగలిగిన పనిని వారికి పురమాయించ కలిగితే మానవాభ్యుదయానికి, సమాజాభ్యున్నతికి, దేశాభివృద్ధికి దోహదం చేసినవారం అవుతాము. గత్యంతరం లేని వాళ్లను, అనాథలను, వితంతువులను, వికలాంగులను, ఆసరా కరువై, ఆదరణకు దూరమైన వృద్ధజీవులకు విధిగా కూడు, గూడు, గుడ్డ వంటి కనీస అవసరాల్ని తీర్చాలన్నది ఇస్లాం ఉపదేశం. ఈ బడుగు, బలహీన వర్గాలను ఉద్ధరించేందుకు మానవ సమాజంలో ధనం లేక కాదు, కావలసిందల్లా మంచి చేయాలన్న హృదయం. సాటి మనిషి ఆదుకోవాలన్న తపన. మానవునికి ఎదుర్కొంటున్న దుర్భిక్ష దయనీయ స్థితిని దూరం చేయాలన్న సదభిప్రాయం కావాలి. అంతే! ఈవిషయమై ఖుర్ఆన్ మనల్ని ఇలా బోధిస్తుంది: **"మరియు దేవుడు నిన్ను మార్గము తెలియని వానిగా పొందెను. కావున నీకు (ధర్మ) మార్గమును చూపెను. మరియు దేవుడు నిన్ను పేదవానిగా పొందెను. కావున నిన్ను ధనవంతునిగా జేసవేసెను. కావున తండ్రి లేని బిడ్డను (అనాథను) నీవు గద్దింపకుము. మరియు అడుగునట్టివానిని అదలింపకుము. మరియు నీ ప్రభువు యొక్క మేలును గూర్చి పలుకుచుండుము".**

(అజ్జుహా: 7- )

మరో చోట ఇలా సెలవియ్యబడింది: **"వ అహ్సిన్ కమా అహ్సనల్లాహు ఇలైక". అల్లాహ్ నీకు ఏ విధంగా మేలు చేశాడో అదే విధంగా నువ్వు కూడా (ప్రజల పట్ల) సద్వ్యవహారం చెయ్యీ. (అల్ ఖసస్: 77)**

ఆ విషయానికొస్తే, మనమందరం బీదవారమే, అవసార్థులమే, అశక్తులమే; ఒక్క అల్లాహ్ తప్ప. **"యా అయ్యుహన్నాసు అన్తుముల్ ఫుఖరావు ఇలల్లాహ..." ఓ ప్రజలారా! మీరంతా అల్లాహ్ అవసరం కలిగినవారే. అల్లాహ్ మాత్రం అక్కర లేనివాడు. సర్వ విధాల స్తుతించదగినవాడు. (ఫాతిర్: !5)**

## ఇవ్వడం కష్టమైతే అడగడం మరింత కష్టం

**'అడిగాడు'** అనగానే అతను ఎంతటివాడైనా అల్పుడైపోతాడు. అంతకు ముందు అతనో దాతయినా, మహా నేతయినా, ప్రాణ మిత్రుడైనా, సమీప బంధువైనా, క్షణం క్రితం వారిని అభిమానించిన మనమే వారిని అట్టడుగున పడేస్తాము. మరుక్షణం నుండి అతనిలోని సకల సుగుణాలకు అర్థం మారిపోతుంది. అతని పరువుప్రతిష్టలు మట్టి పాలవుతాయి, అతని కీర్తికండూతి మొత్తం జీరో స్థాయికి చేరుకుంటుంది ఏం? అడిగినందుకు ఫలితం కలిగినా, కలగకపోయినా ఈ ఛీత్కారం మాత్రం తప్పదు. ఇలా మనం ఎందుకు వ్యవహరిస్తామో ఒక్క క్షణం కోసం ఎప్పడైనా సునిశితంగా ఆలోచించామా?! ఒక వ్యక్తి మనల్ని ఏదైనా సహాయం అడిగాడు అంటే మనల్ని తన పాలిట శ్రేయోభిలాషులుగా ఎంచి తన సమస్యను మన ముందు పెట్టాడు అని ఎందుకు అనుకోము? అడిగాడు-అంటే, అడుక్కున్నాడు, ముష్టెత్తుకుంటున్నాడు అనేగా అని వాదిస్తాము. ఇంకా స్నేహము, బాంధవ్యము, మర్యాద అన్న మాటలు అర్థం లేనివి అని భావిస్తాము. అది అతని పాలిట వరమో లేదా మన పాలిట శాపమో దేవుడికే ఎరుక.

ఎంత కష్టం! ఆలోచించే కొద్దీ గుండె తరుక్కుపోతుంది. ఎవరిని అడగాలి? ఎలా అర్థించాలి? ఏవిధంగా ఆరంభించాలి? ఏమని అడగాలి? కంఠస్వరంలో గాద్గదం కలుగుతుంది. లోగొంతు పడుతుంది. మాట రావడం కష్టమైపోతుంది. బలవంతంగా మాటను బయటికి ఈడ్వాల్సి ఉంటుంది. ఈ సంఘర్షణలో మాటలు తెగిపోతాయి. అన్ని అక్షరాలు స్వచ్ఛంగా ఉచ్చరించడానికి దమ్ము, ధైర్యమ చాలదు. అనుకున్న మాటలు అంతరిక్షానికి ఎగిరిపోతాయి. వల్లే వేసుకున్న పాఠాలు చెల్లాచెదురైపోతాయి. ఇదో వేదనయితే, అడినందుకు ఫలం **'అడిగాడు'** అని అన్పించుకోవడం తప్ప ఇతర ఫలం దక్కదేమోనన్న యమ యాతన మరో వైపు. ఒళ్లంతా పాములు, తేళ్లు పాకుతున్న అనుభూతి. గుండెల్లో శూలాలు గుచ్చుకుంటున్నట్టు విపరీత బాధ. ప్రాక్టిస్ కోసమే **'సహాయం'** అని అనబోతాడు. 'స' అన్న అక్షరం మాత్రమే వినబడుతుంది. తర్వాత అధరాలు మాత్రం అదురుతాయి. మనసున్న మారాజులు, ఎవరికి వారు ఊహించుకోవాల్సిందే, ఒకరికి మంచి చేయాలన్న హృదయం గలవారు గ్రహించుకోవాల్సిందే. ఈ యాతన అంతా పూర్వ రంగమే. ఇది తెలిసిన కాళిదాసు ఇలా అన్నాడు: **అభ్యర్థనాభంగ భమేవ సాధుః**

**మాధ్యస్థ మిష్టే పృపలంబ్య తేర్థే**

అడిగితే ఎక్కడ లేదని సమాధానం వినవలసి వస్తుందేమోనని కావలసిన వస్తువును కూడా అక్కర లేదన్నట్టే ఊరుకుంటారట. ఖుర్అన్‌లో ఇటువంటి ఆత్మాభిమానధనుల గురించి ఇలా సెలవియ్యబడింది: **"ముఖ్యంగా సహాయానికి అర్హులైనవారు, దైవ ధ్యేయ పథంలో తలమునకలై ఉండి స్వంత ఉపాధి సంపాదనకై ధరణిలో ఎటూ కదలలేని నిర్ధనులు. వారిని ఎరుగని వ్యక్తి వారి ఆత్మాభిమానాన్ని చూసి, వారు కలిగినవారేనని తలపోస్తాడు. వారి ముఖాల ద్వారా వారి నిజ స్థితిని మీరు గ్రహించగలరు. కాని, వారు జనుల వెంటబడి అర్థించే రకం కాదు. వారి సహాయార్థం మీరు ఏదైనా ఖర్చు చేస్తే అది అల్లాహ్‌కు తెలియకుండా ఉండదు".** (అల్ బఖర: 273)

మరో చోట ఇలా ఉంది: **"వ యస్అలూనక మాజా యున్ఫిఖూన్ ఖులిల్ అఫ్వ్"** ఏం ఖర్చు పెట్టాలి? అని వారు నిన్ను అడుగుతున్నారు. (ఓ ప్రవక్తా!) 'మీ ఖర్చులు పోగా మిగిలినది' అని నువ్వు వారికి చెప్పు. (అల్‌బఖర:2!9 )

మన అవసరాలకు అయి మిగిలిన దాంట్లోంచి కొంచెం ఇవ్వడానికే మనకు అంత కష్టంగా ఉంటే, తన దగ్గర మిగిలున్న ఒకేఒక్క ఆత్మాభిమానం అనే ధనాన్ని సయితం పరిత్యజించి **'లేదు'** అని అడగటం అంతకన్నా కష్టమవుతుంది. ఇచ్చేవాడి త్యాగం రవ్వంత అయితే, ఆత్మాభిమానాన్ని చంపుకుని అడిగేవాడి త్యాగం కొండంతటిది. ఆశ్చర్యంగా ఉంటాయీ మాటలు. అడుక్కునేవారికి త్యాగంతో ఏం సంబంధం? అని శంకిస్తుంది హృదయం. కొంచెం అతిగా, అసత్యంగా ఉన్నట్టు కూడా తోస్తుంది. నిజమే. కాని అడిగేవాడు ఎవడు? అడగడమే అలవాటుగా, అదే తమ వృత్తిగా చేసుకొని ఊర్లమీద పడి తిరిగేవారు ఈ జాబితాలోకి రారు. వీరు అడుక్కొడాన్ని ఒక విద్యగా, ఒక కళగా చేశారు. కాలెజీలు, యూనివర్సిటీలు లేవుగాని, ఉంటేనా ఈ కళలో వీరంతా డిగ్రీలు పుచ్చుకుని పట్టభద్రులయి ఉండేవారేమో కాబోలు! ఈ వృత్తి పెద్దల్ని అడిగారని చెబితే అపచారం, అపచారం అంటూ లెంపలేసుకోవడం మనకు ముందు నుంచి ఉన్న ఆనవాయితే. **"సువర్ణ పుష్పం సమర్పయామి"** అంటూ సగౌరవంగా ఇచ్చుకుంటాము. అవును; ఇటువంటివారు అడుక్కోడానికే పుట్టారనిపిస్తుంది అప్పుడప్పుడు. ధర్మశాస్త్రాలు వీరి సొత్తు అయినట్టు. ధర్మం వీరి చుట్టమైనట్టు. ఇట్టివారికి ఎట్టి వ్యధాభరిత శిక్ష ఉంటుందో ప్రవక్త (స) హెచ్చరించి ఉన్నారు: **"ప్రజల దగ్గర అడుక్కోవడమే వృత్తిగా చేసుకున్న వ్యక్తి, ముఖంపై ఒక మాంసపు తునకయినా లేని స్థితిలో అల్లాహ్‌ను కలుసుకుంటాడు".** (బుఖారీ,ముస్లిం)

**"ధనాన్ని కూడబెట్టాలన్న ఉద్దేశ్యంతో అడక్కునేవాడు వాస్తవానికి అగ్ని జ్వాలల్ని కోరుకుంటున్నాడు. కనుక ఎక్కువ అడుక్కుంటాడా, తక్కువ అడుక్కుంటాడా అనేది అతని ఇష్టానికే వదిలిపెడుతున్నాను".** (ముస్లిం)


**"(అవసరం లేకపోయినా అలవాటు) భిక్షాటన ఒక గాయం లాంటిది. మనిషి భిక్షాటన చేసి తన ముఖాన్ని గాయపర్చుకుంటాడు".** (తిర్మిజీ)

(ఇంకా ఉంది)

# రక్తం – జీవాన్నిచ్చే ద్రవం

దీనికి భిన్నంగా, రక్తంలోని పదార్థాలు కంట్రోల్ లేకుండా మెదడు యొక్క టిష్యూలలోకి ప్రవేశించకూడదు. ఎందుకంటే అనవసర పదార్థాలు నెర్వ్ కణాల (న్యూరిన్స్)ను తీవ్రంగా పాడుచేస్తాయి. కాబట్టి అన్ని రకాల హాని కలిగించే వాటి నుండి మెదడు రక్షింప బడుతుంది. మందమైన కణపొరలు రంధ్రాలను మూసేస్తాయి. ఈ పొరల గుండా అవసరమైన అన్ని రకాల పదార్థాలు వెళతాయి. ఎలా అంటే సెక్యూరిటీ చెక్ పాయింట్‌లో నుండి తనిఖీ కాబడి వెలుతున్నట్లు. ఈ విధానం వలన మొత్తం శరీరంలోని చాలా సున్నిత అవయవాలకు పోషక పదార్థాలు సరిగ్గా ప్రసరణ కావడం సులభం అవుతుంది.

**శరీరంలో థర్మోస్టాట్**





విటమిన్స్ మరియు ఇతర పదార్థాలతో పాటు, కణాలలో శక్తి ఉత్పత్తి కావడం వలన వెలువడిన వేడిని కూడా ఎర్రరక్త కణాలు తీసుకెళతాయి. బయటి వాతావరణంలోని వేడిని బట్టి, రక్తం తీసుకెళ్ళే వేడిని శరీరంలో పంచ డం ద్వారా శరీర ఉష్ణోగ్రతను బేలన్స్ చేయడం అతి ముఖ్యమైన విషయం. మన శరీరా లలో గనుక వేడిని పంపిణీ చేసే వ్యవస్థ గనుక లేకపోతే, మన చేతి కండరాలను ఉపయోగించినపుడు, మన చేతు లు తీవ్రమైన వేడిగా ఉండి, మిగతా శరీరం చల్లగా ఉంటుంది. ఈ విధంగా గనుక జరిగితే మెటాబో లిజమ్ (ఆహార పదా ర్థాలు జీవ పదార్థాలుగా మారే ప్రక్రియ) పాడవుతుంది. మన శరీరంలో జరుగు తున్న రక్త ప్రసరణ వ్యవస్థే మన శరీర మంతటా సమంగా వేడి పంపిణీ అవడాన్ని సులభతరం చేస్తుంది.

మన శరీర ఉష్ణోగ్రతను చల్ల బరచడానికి, చెమట పట్టించే వ్యవస్థ యాక్టివేట్ అవుతుంది. చర్మం క్రింద ఉండే బ్లడ్ వెసల్స్ ఎన్‌లార్జ్ (పెద్దవిగా) అయ్యి, ఎక్కువ వేడిని బయటి గాలిలో పంపేలా చేస్తాయి. అందుకే మనం పరుగెడుతున్నప్పుడు గాని లేదా శక్తినుపయోగించి ఏమైనా పనులు చేసిప్పుడుగాని, మన ముఖాలు ఎర్రగా మారతాయి.

బయట చల్లగా నున్నప్పుడు మన శరీర వేడి ని నిల్వచేసే బాధ్యత కూడా రక్త ప్రసరణదే. చూట్టూ ఉన్న ప్రదేశాలు బాగా చల్లగా ఉంటే, మన చర్మం క్రింద ఉంటే బ్లడ్ వెసల్స్ ముడుచుకు పోతాయి. దాని వలన ఆ ప్రాంతంలో రక్తం తక్కువగా ఉండి వేడి తప్పించుకు పోదు. అందుకనే బాగా చల్లని వాతావరణంలో మన ముఖాలు తెల్లగా అవుతాయి.

రక్తంలో జరిగే ప్రతీ విషయం చాలా క్లిష్టంగానూ ఉంటుంది. సూక్ష్మమైన వివరాలతో సహా మానవ సృష్టి ఎంత దోష రహితంగా జరిగింది. నిజానికి రక్త ప్రవాహంలో ఎలాంటి అద్భుతమైన ఇంట్రికేట్ బేలన్స్ ఉందంటే, కొంచెం బ్రేక్‌డౌన్ అయితే చాలు, తీవ్రమైన చిక్కులకి కారణమవుతుంది. రక్తాన్ని దానిక వసరమైన అన్ని ధర్మాలతో సహా క్షణంలో సృష్టించిన సృష్టికర్త ఒక్కడైన అల్లాహ్‌యే!

**చిన్ని దోషానికి కూడా తావులేని వ్యవస్థ: బ్లడ్ క్లాటింగ్ (రక్తం గడ్డ కట్టడం)**




ఏదైనా గాయం తగిలినపుడో, లేదా కోసుకుని గాని లేదా పాత గాయమే రేగి మరలా రక్తస్రావం అవుతుంటే అది చివరికి ఆగి పోతుందని ప్రతీ ఒక్కరికి తెలుసు. రక్తస్రావం అయిన చోట, రక్తపు గడ్డ ఏర్పడి, గట్టిపడి, సరియైన టైమ్‌లో గాయాన్ని తగ్గిస్తుంది. ఇది మనకు సులభమైన, సాధారణ ప్రక్రియగా అనిపించవచ్చు. కాని జీవరసాయన శాస్త్రజ్ఞులు వారి పరిశోధనల ద్వారా తెలిపిన విషయాలను బట్టి, చాలా సంక్లిష్టంగా ఉండే ఓ వ్యవస్థ పని చేయడం వలననే ఇది జరుగుతుంది. ఈ వ్యవస్థలో పని చేసే ఏ ఒక్క అంశం తగ్గినా లేక అది పాడయినా, మొత్తం ప్రక్రియ వృధా అవుతుంది.

సరియైన సమయం మరియు సరియైన చోట రక్తం గడ్డ కట్టాలి. సాధారణ పరిస్థితులు నెల కొనగానే, గడ్డ మాయమవుతుంది. ఈ వ్యవస్థ సూక్ష్మస్థాయి (మైన్యుటెస్ట్ డిటైల్) వరకూ దోష రహితంగా పనిచేస్తుంది.

రక్తస్రావం జరగుతున్నప్పుడు, ఆ జీవి చనిపో కుండా వెంటనే రక్తపు గడ్డ ఏర్పడాలి. అంతే కాకుండా గాయం మొత్తానికి, గాయంపైన దాని ఉపరితలంపై గడ్డ ఉండాలి. లేకపోతే మొత్తం రక్తం గడ్డకట్టి మరణానికి దారి తీయవచ్చు. అందు వలనే గడ్డ అనేది సరియైన సమయంలో సరియైన చోట ఏర్పడాలి.

రక్తం గడ్డ కట్టడానికి రక్తంలో ఉండే చిన్ని మూలకాలు (ప్లేట్‌లెట్స్ లేక త్రాంబోసైట్స్) చాలా ప్రధానమైనవి. ఈ కణాలు రక్తం గడ్డ కట్టే ప్రక్రియలో మొదట ఉండే ముఖ్యమైన మూలకాలు. రక్త ప్రసరణను నిరంతరం పహారా కాసే (వోన్ విల్లిబ్రాన్ ఫ్యాక్టర్) అనే ప్రోటీన్ గాయం తగిలిన చోటును ప్లేట్‌లెట్స్ మిస్ అవకుండా, అవి ఆ స్థలాన్ని తెలుసుకునేలా చేస్తాయి. ఆ విధంగా గాయమైన ప్రదేశంలో ప్లేట్‌లెట్స్ సులభంగా విడదీయలేని విధంగా చేరిపోయి, ఓ పదార్థాన్ని విడుదల చేస్తాయి. అది లెక్కలేనన్ని ఇతర ప్లేట్‌లెట్స్‌ని ఆ ప్రదేశంలో సేకరింపబడేలా చేస్తుంది.

ఈ కణాలు చివరికి తెరచి ఉన్న గాయానికి చేరుకుంటాయి. గాయాన్ని గుర్తించడంతో ప్లేట్‌లెట్స్ యొక్క బాధ్యత తీరిపోయి అవి చనిపోతాయి. రక్తం గడ్డ కట్టించే వ్యవస్థలో ఓ భాగమే ఈ ప్లేట్‌లెట్స్ యొక్క త్యాగం.

త్రాంబిన్ అనే మరో ప్రోటీన్ రక్తం గడ్డ కట్టడాన్ని సులువు చేస్తుంది. అయితే ఇది గాయం ఉన్న ప్రదేశంలోనే ఉత్పత్తి అవుతుంది. ఈ త్రాంబిన్ ఎంత మోతాదులో ఉత్పత్తి అవ్వాలి అనేది ముఖ్యం. అవసరమైన దానికంటే ఎక్కువగాని తక్కువగాని ఉత్పత్తి కాకూడదు. అలాగే సరియైన సమయంలో మొదలవ్వాలి మరియు సరియైన సమయంలోనే ఖచ్చితంగా ఈ ఉత్పత్తి ఆగిపోవాలి. ఎంజైములనబడే 20 కంటే ఎక్కువగా ఉండే శరీర రసాయనాలు, ఈ త్రాంబినొ ఉత్పత్తిలో మఖ్యమైన పాత్రను పోషిస్తాయి. ఈ ఎంజైములు వాటి ప్రత్యుత్పత్తిని జరపడంగాని, ఆపటంగాని చేయగల వు. ఈ పక్రియలో చాలా విపులమైన తనిఖీ జరుగుతుంది. నిజంగా టిష్యూలకు గాయమయినప్పుడే త్రాంబిన్ ఏర్పడుతుంది.

శరీరంలో రక్తాన్ని గడ్డకట్టించే ఎంజైములు, తగిన స్థాయికి చేరిన వెంటనే, ప్రోటీన్‌లతో కూడిన ఫ్రిబ్రినోజెన్స్ ఏర్పడతాయి. చాలా తక్కువ సమయంలోనే, ఫైబర్స్ మెష్‌తో ఓ గూడు ఏర్పడుతుంది. బయటికి రక్తం పోయే ప్రదేశంలో ఇది ఏర్పడుతుంది. ఈ మధ్య సమయంలో పహారా కాసే ప్లేట్‌లెట్స్ అంతరాయం లేకుండా అదే ప్రదేశంలో విడదీయడానికి కష్టమయ్యే విధంగా కలిసి మరియు ప్రోగవుతాయి. ఇవి ప్రోగవడం వలన గాయం యొక్క రంధ్రం మూయబడుతుంది. దానికే క్లాట్ అని పిలుస్తాము. గాయం పూర్తిగా మానిపోతే, గడ్డ కరిగిపోతుంది.

గడ్డ ఏర్పడేలా చేయడం, అది ఎంత మేర ఉండాలి, ఎంత గట్టిగా ఉండాలి లేదా కరగాలి అని నిర్ధారణ చేసే ఈ వ్యవస్థ నిస్సందేహంగా తగ్గించనలవికాని సంపూర్ణ సంక్లిష్ట మైనదని స్పష్టంగా తెలుస్తుంది కదా!

**ది సిస్టమ్ వర్క్**

ఖచ్చితంగా పని చేసే వ్యవస్థలో చిన్ని చిన్ని సమస్యలొస్తే ఏం జరుగుతుంది? ఉదాహరణకు, గాయం లేకుండానే రక్తంలో గడ్డ ఏర్పడితే లేదా గాయం నుండి గడ్డ వేరు పడిపోతే? ఈ ప్రశ్నలకి ఒకటే సమాధానం:

గుండె, మెదడు, ఊపిరితిత్తుల్లాంటి అతి ముఖ్యమైన మరియు సంక్లిష్టమైన అవయవాలలో రక్తపు గడ్డలు అడ్డుపడతాయి. ఎన్నో కాంప్లికేషన్స్ తలెత్తుతాయి. మరణించే అవకాశం కూడా ఉంది. వాస్తవంగా ఇది మనకు మరోసారి స్పష్టం చేసేదేమిటంటే–మానవ శరీరం పరిణామ సిద్ధాంతంచే అనుకోకుండా జరిగిన దాని వలననో (లేదా) క్రమంగా అభివృద్ధి జరిగిందనే ఆధారరహిత ప్రతిపాదనల ద్వారా రక్తం యొక్క ఈ క్లాటింగ్ వ్యవస్థను దోష రహితంగా వివరించడం అసాధ్యం.

అంత శ్రద్ధతో కూడిన నైపుణ్యంతో నిర్మించబడిన మరియు గణనాలతో కూడిన వ్యవస్థ – అల్లాహ్ యొక్క సృష్టిలోని పరిపూర్ణత (పెర్‌ఫెక్షన్)కి సాక్ష్యం. ఇందులో వాదనకు అవకాశమే లేదు.

మనందరిని సృష్టించి, ఈ భూమి మీద ఉంచిన అల్లాహ్‌యే మన జీవితాలలో, గాయాల పాలయ్యే ఎన్నో సందర్భాలలో మనల్ని రక్షించే ఇటువంటి వ్యవస్థలతో మన శరీరాలను సృష్టించాడు.


బ్లడ్ క్లాటింగ్ మనకి కనిపించే గాయాల విషయంలోనే కాకుండా, నిత్యం మనకు కనిపించకుండా జరిగే రక్తనాళాల రాపిడి వలన కనిపించని గాయాలకు కూడా చాలా అవసరం. మనం గుర్తించనప్పటికినీ, అంతరాయం లేకుండా చిన్న, చిన్న అంతర్గత రక్తస్రావాలు మన శరీరం లోపల జరుగుతూనే ఉంటాయి. తలుపు (డోర్)కి మన చేయి తగిలినప్పుడో లేదా చాలా బరువుగా కూర్చోవడంలో, వందల సంఖ్యలోని మన రక్తనాళాలు రాపిడికి గురవుతాయి. ఈ రక్తస్రావాలు వెంటనే క్లాటింగ్ వ్యవస్థ ద్వారా ఆగిపోతాయి. ఆ నాళాలు వాటి సాధారణ స్థితిలో మరలా నిర్మించబడతాయి.

ఒకవేళ దెబ్బ చాలా తీవ్రమైనది అయితే, లోపల జరిగే రక్తస్రావం బలంగా ఉండి, చర్మం కములుతుంది. దీనినే 'టర్మింగ్ పర్పుల్' అంటారు.

కోయాగులేషన్ వ్యవస్థ లేని మనిషి చిన్న చిన్న దెబ్బలకు సైతం దూరంగా ఉండాలి. హీమోఫిలిక్ పేషంట్లకు కోయాగులేషన్ వ్యవస్థలో దోషాలు ఉంటాయి. వారు తమ జీవితాన్ని చాల జాగ్రత్తగా గడపాలి.

తీవ్రమైన హీమోఫిలియా ఉన్న రోగులు ఎక్కువ కాలం బ్రతకలేరు. ఇలాంటివారు కొద్దిగా జారిపడితే చాలు, వారి జీవితాలు ముగుస్తాయి. ఈ చిన్న సత్యాన్ని బట్టి, ప్రతీ ఒక్కరూ ఈ సృష్టిలో ఉన్న అద్భుతాలను గమనించాలి. దోషరహితంగా మన శరీరాలను తయారు చేసిన అల్లాహ్‌కు కృతజ్ఞులుగా ఉండాలి.

**"భూమిలో ఎన్నో నిదర్శనాలు ఉన్నాయి. స్వయంగా మీలోనూ ఉన్నాయి. మీరు ఆలోచించరా?"**(ఖుర్‌ఆన్ 51: 20–21)




ఈ శరీరం మనకు అల్లాహ్ నుండి అందిన వరం. దీనిలోని ఒక్కటంటే ఒక్క కణాన్ని కూడా ఎవరూ తయారు చెయ్యలేరు.

# మీరూ విజేత కాగలరు...!



**జీ**వితంలో అప్పుడప్పుడే అడుగు పెడుతున్న వ్యక్తికి **'నీకు ఏం కావాలి? భవిష్యత్తుల్లో నువ్వు ఏం సాధించదలచుకున్నావు?'** అని అడిగితే చాలా మంది దగ్గర నుంచి సమాధానం **"నేను బాగా చదువుకొని, నా కాళ్ళ మీద నేను నిలబడగలగాలి. చక్కటి సంసారం, అందమైన ఇల్లు, నా పిల్లలకు మంచి భవిష్యత్తు ఉండి, మిగతా జీవితం విశ్రాంతి తీసుకుంటూ, మనవళ్ళు, మనవరాళ్ళతో ఆడుకుంటూ జీవితం సాగితే అంతకన్నా ఇంకేం కావాలి"** అంటారు. మరి కొంత మంది అయితే ఇంకాస్త ముందుకెళ్ళి-ఏ అమెరికాకో, దుబాయ్‌కో వెళ్ళి అక్కడ కొంత కాలం (ఇష్టం లేకపోయినా) కష్టపడి అక్కడి నుంచి మా ఇంటికి డబ్బు పంపిస్తూ, పొదుపు చేసుకుంటూ తర్వాత స్వదేశానికి వచ్చి స్థిరపడి ఒక ఇల్లు కట్టుకుని..... (ఇక్కడి నుంచి మళ్ళీ మామూలు సమాధానమే) చెప్తారు.

**'నాకు అనిల్ అంబానీలకున్నంత ఆస్తి ఉంటేనా -దర్జాగా కొంతకాలం బ్రతికి ఆ తర్వాత హాయిగా చచ్చిపోతాను'** అనుకునే వాళ్ళకూ కొదువ లేదు. అలాగే **'నేను ఏమవ్వాలో, ఏం అవ్వకూడదో విధే నిర్ణయిస్తుంది'** అని సంతాప పడేవారూ ఉంటారు.

అందచందాలతో అలరారుతూన్న ఈ వింత విచిత్ర లోకాన్ని చూసి నేడే కాదు నాడు సైతం అనేకులు ఈ విధంగా ఆశించారన్నది గమనార్హం.

**ఓ రోజు అతను (ఖారూన్) పూర్తి ఠీవి దర్పాలతో ప్రజల ముందుకు వచ్చాడు. అప్పుడు ప్రాపంచిక వ్యామోహపరులు కొందరు అతడ్ని చూసి 'ఖారూన్‌కు లభించిన సిరిసంపదలు మనకూ లభించుంటే ఎంత బావుండు! ఖారూన్ ఎంతో అదృష్టవంతుడు' అన్నారు. అయితే జ్ఞానం కల వారు (వారి ఆలోచనా ధోరణిని విమర్శిస్తూ) "మీ వైఖరి చాలా విచారకరం" అన్నారు.** (ఖసస్:79)

'మీరన్నది సరైంది కాదు. పిల్లల్ని బాగా చదివించాలి. దానికి డబ్బు కావాలి. ఆడపిల్లల పెళ్ళిళ్ళు చేయించడానికి మంచి సంబంధం రావాలంటే ఏదో అంతో ఇంతో ఇచ్చుకునే స్థోమత, హోదా ఉండాలి కదా! ఇందులో తప్పేముంది?' అని మీరు అనొచ్చు. సరే మీ మాటను కాదనటం లేదు. కాని **'ఏదో ఈ బ్రతుకు ఇలా సంతృప్తిగా సాగిపోతే చాలు'** అన్న మామూలు స్థాయి నుంచి **'ఇహ పరలోకంలో మనక్కావాల్సిందేదో మనం సాధించి తీరాలి'** అన్న అత్యుత్తమ ఆలోచనాస్థాయికి వెళ్ళడం ఆరోహణ! అసలు సిసలైన కీర్తి శిఖర అధిరోహణ!! ఎందుకంటే, దేవుడు చేసిన ప్రకృతి నియమం అది.

**"ఏ జాతి అయినా తనను తాను సంస్కరించుకోనంత వరకూ అల్లాహ్ కూడా నిశ్చయంగా దాని పరిస్థితిని మార్చడు, ఇదొక యదార్థం".** (రాద్:11)

తుమ్మ విత్తనం నాటి నిమ్మ చెట్టు మొలకెత్తాలని కోరుకోవడం అత్యాశ, పేరాశే కావచ్చు. కాని మామిడి విత్తనం నాటి మామిడి చెట్టే మొలకెత్తాలని, వివిధ మామిడి అంట్లు కట్టి రకరకాల మామిడి ఫలాల్ని పండించాలని కోరుకోవడంలో అత్యాశ ఏమీ లేదు. అసహజత ఎంత మాత్రం కాదు. అది మానవ సహజంతో పాటు మానవలోకాన్ని ప్రగతి పథంలో నడిపించే గొప్ప అభియోగం.

మనిషి కృషి చేసిన ప్రతి రంగంలో ఫలం పొందుతున్నాడు. అయితే ఎవరి కార్య దృష్టి ఎన్ని దూరాల వరకు వెళ్ళగలుగుతుందో ప్రతిఫలమూ అంత దీర్ఘమయినదే ప్రాప్తిస్తుంది. ఈ క్షణం కష్టపడితే మరు క్షణం ఫలం దక్కాలని కోరుకునేవారొకరయితే, యౌవనంలో పడిన శ్రమకు బదులు వృద్ధాప్యం హాయిగా గడపాలని ఆశించే వారు మరొకరు. ఇంకా కొందరయితే తాము కృషి సలిపిన దానికి తమ తర్వాతి తరాల వారు సుఖ పడితే చాలనుకుంటారు. అలాగే బ్రతికుండి కూడా మరణించిన వారు కొందరైతే... తమ కృషి కార్య దీక్ష, దక్షతల మూలంగా మరణించి కూడా ప్రజల హృదయాల్లో బ్రతికే ఉన్నవారు. శాశ్వత పేరు ప్రఖ్యాతలతో వర్ధిల్లుతున్న వారు ఎందరో మహానుభావులు!

దైవప్రవక్త(స) ఇలా ప్రబోధించారు: **"స్వర్గం మనసుకి నచ్చని విషయాలతో కప్పబడి ఉంది. నరకం చుట్టూ మనో (తుచ్ఛ) కోరికలు అల్లుకొని వున్నాయి."** కనుక ఏది నాటుతామో దాన్నే కోస్తాము.

**"జైసి కర్నీ వైసి భర్నీ - కమా తుదీను తుదాను"** మనం కోరుకునే ప్రతి వస్తువును (స్వర్గంతో సహా) తీవ్ర తపన, శ్రమ వల్ల పొందగలం. లోకులు చూసే బాహ్య శక్తి మనలో వున్నట్లే, మనలోని అంతర్గత శక్తి, ఆత్మవిశ్వాసం కూడా విజయం కోసం అంతే అవసరం. మనతో మనం తరచు వేసుకోవాల్సిన ప్రశ్న **"నిన్ను నీవు ఎలా భావిస్తున్నావు ?"** అన్నదే కాని నిన్ను లోకులు ఏ దృష్టితో చూస్తున్నారన్నది కాదు. పూర్వం గొప్ప ప్రసిద్ధి గాంచిన నానుడి ఒకటుండేది. ప్రజలు మూడు రకాలు.

1) లోక చరిత్రతో వీరికి ఎటువంటి సంబంధం ఉండదు.

2) లోకంలో జరిగే సంఘటనలను ప్రేక్షక పాత్రతో చూస్తుండిపోయేవారు.

3) కొత్త చరిత్రకు నాంది పలికేవారు.

మరో విధంగా చెప్పాలంటే, గొప్పవాళ్ళు వ్యూహాల గురించి, మధ్యములు సంఘటనల గురించి, అధములు వ్యక్తుల గురించి మాట్లాడుతారు. ఈ ముగ్గురిలో ఎవరు కాదల్చుకుంటున్నామో? మనమే నిర్ణయించుకోవాలి.

కొందరి సంభాషణల్లో ఎక్కువ ఇతరుల గురించే ఉంటుంది. అందులో ఎక్కువ చెడే ఉంటుంది. తమకు తెలియని (ఆ వ్యక్తుల వ్యక్తిగత) విషయాలు కూడా తాము కళ్ళతో చూచినట్టుగా రెచ్చిపోయి మరీ చెప్పేస్తుంటారు. వీరే అధములు.

కాశ్మీర్ నుంచి కాల్ఫోర్నియా వరకూ వీరు చర్చిస్తుంటారు. అందులో వాస్తవం కన్నా కల్పన, అభిప్రాయమూ ఎక్కువ వుంటుంది. వీరే మధ్యములు.

అదే గొప్పవారు, అనవసర విషయాలకి తమ సంభాషనాల్లో అంతగా ప్రాముఖ్యత ఇవ్వరు. వారి దృష్టిలో-1) అక్కడ లేని వ్యక్తి గురించి కానీ, 2) తమకు సంబంధం లేనీ సంఘుట గురించి గాని, 3) తమలో లేని గొప్పల గురించిగాని చర్చించటమంత బుద్ధి తక్కువ పని మరొకటి లేదు. సంభాషణ వల్ల తాము నేర్చుకుంటారు. లేదా, ఇతరులకి నేర్పుతారు.

జీవితంలో అది దేనికి సంబంధించినదైనా పైకి రావాలంటే మూడు ప్రశ్నలు తప్పని సరి! 1) మన తప్పు ఎంత తొందరగా సరిదిద్దుకుంటాము? 2) ఇతరుల తప్పుల్నుంచి (గుణపాఠం) ఎంత తొందరగా గ్రహిస్తాము? 3) మన బలహీనతల్నుంచి ఎంత తొందరగా బయట పడతాము? అందుకే పెద్దలన్నారు: **"ఇతరుల తప్పుల్నుంచి నేర్చుకోక తప్పదు. ఎందుకంటే, అన్ని తప్పులూ మనమే చేయటానికి సమయం సరిపోదు కాబట్టి".** మన జీవిత గృహాల్లోకి ఎందరో వస్తూ పోతూ ఉంటారు. కొందరే తమ ప్రభావితపు ప్రతిభ పరిమళాల్ని వదిలి వెళ్తారు. అలాంటి వారి సహచర్యమే మన తదుపరి కర్తవ్యం.

ఈ జీవితం నిరంతర సమర క్షేత్రం. మనిషి కళ్ళు తెరవగానే ప్రారంభమవుతుంది. మళ్ళీ కళ్ళు మూసుకునే వరకు సాగుతుంది. మనిషి తన ఆత్మ చక్షువుల్ని తెరువగలిగే క్షణం మహత్తరమయినది. అది జీవన సంగ్రామానికి శంఖారావం. సంఘర్షణ సంరంభానికి ప్రారంభం.




## మన అంతర్‌చ్చక్షువుల్ని తెరిచే రెండు పరీక్షలు.....!

**1 - మిమ్మల్ని మీరు పరీక్షించుకోండి.....!**

1) మీరు మానసిక వ్యధ, అలజడితో సతమతమౌతున్నారా? అయితే మీ విజయాన్ని గూర్చి పునరాలోచించుకోండి.

2) ఇతరులతో మీకు గల ప్రతి సంబంధం తెగిపోయిందని ఫీలవుతున్నారా? అయితే మీ విజయాన్ని గూర్చి పునరాలోచించుకోండి.

3) ఈ లక్ష్య సాధన కోసం ఇన్ని త్యాగాలు అవసరమా? అన్న ప్రశ్న మిమ్మల్ని కలచి వేస్తూందా? అయితే మీ విజయాన్ని పునర్పరిశీలించుకోండి.

4) మీరు విజేతలయి, ఇతరులు సాధించే విజయాల పట్ల అసూయ చెందుతున్నారా? అయితే మీ విజయాన్ని పరిశీలించుకోండి.

5) 'నేను చెయ్యగలను' అన్న ఆత్మవిశ్వాసం గాక 'నేను మాత్రమే చెయ్యగలను' అన్న ఓవర్ కాన్ఫిడెన్స్‌తో ఇతరుల సలహాలను పట్టించుకోవటం లేదా? అయితే మీ విజయాన్ని పునర్పరిశీలించుకోండి.

6) పడకపై మేను వాల్చి - లోకమంతా ప్రశాంతంగా నిద్రిస్తుంటే నాకు మాత్రం నిద్ర పట్టడం లేదు, అన్న ఆలోచనతో మీ బుర్ర వేడెక్కుతుందా? అయితే మీ విజయాన్ని పునర్పరిశీలించుకోండి.


గుర్తుంచుకోండి! కోపం ద్వేషం - రెండింటి చివరి అక్షరమూ ఒకటే. వాటి వల్ల మిగిలేది కూడా అదే!..... **"సునా"** !!

ఇప్పుడు మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోవచ్చు.....!


"నేను నిజంగానే విజేతనా ?" **(మిగతాది 18వ పేజీలో)**

సుమయ్యా

# మీ ప్రభువు వైపునకు మరలండి..!



భూమ్యాకాశాలను వాటి మధ్య ఉన్న సమస్తాన్ని సృష్టించినవాడు, యావత్తు విశ్వానికి అధిపతి, అణువణువుపై పూర్తి అధికారం కలిగినవాడు మన ప్రభువు. సూర్యుడ్ని, చంద్రుడ్ని సృష్టించిన వాడు, ప్రతి రోజూ సూర్యుడ్ని తూర్పు నుండి ఉదయింపజేసే వాడు, పడమరన అస్తమింపజేసే వాడు, మన ప్రభువు. మన కోసం రాత్రిని విశ్రాంతి కొరకు, పగటిని ఉపాధి సాధనంగా చేసినవాడు మన ప్రభువు. సముద్రాలను సృష్టించినవాడు, నదులను ప్రవహింపజేసినవాడు, మన కోసం సముద్రాలను అదుపులో ఉంచిన వాడు మన ప్రభువు.



ఆకాశం నుండి వర్షం కురిపించి, దాని ద్వారా మృత భూమికి జీవం పోసేవాడు, దాన్యం, కూరగాయలు, పండ్లు ఫలాలు, పచ్చిక మొలకెత్తించి మనకూ, మన పశువులకూ జీవన సామాగ్రి ఏర్పాటు చేసే వాడు మన ప్రభువు.

పైన రెక్కలు జూపుతూ, ముడుస్తూ ఎగిరే పక్షుల్ని పరికించి కాస్త చూడండి. వాటిని ఏ ఆధారం లేకుండా పట్టి ఉంచినవాడే మన ప్రభువు. ప్రాణుల్ని గమనించండి వాటిలో కొన్ని పొట్టతో ప్రాకుతాయి, కొన్ని రెండు కాళ్ళతో, మరి కొన్ని నాలుగు కాళ్ళ తో నడుస్తాయి. ఇలా తాను తలచిన విధంగా సృష్టించినవాడే మన ప్రభువు. రక రకాల పండ్ల రసాన్ని, పుష్ప మకరందాన్ని ఆస్వాదించి, కొండల్లో చెట్లల్లో, పందిళ్ళపై తేనె తెట్లు నిర్మించి నా దాసులకు స్వస్థత నిచ్చే పానకం అందించమని ఆదేశమిచ్చిన వాడు మన ప్రభువు.

పశువుల పొట్టలోని పేడకు, రక్తానికి మధ్య నుండి త్రాగడానికి స్వచ్ఛమైన పాలు ప్రసాదించేవాడు మన ప్రభువు. నిస్సందేహంగా ఆయన ప్రతి పని చేయగల సమర్థుడు. సర్వశక్తిమంతుడు.

ఆయనే ఆది మానవుడైన ఆదం(అ)ను మట్టితో సృజించాడు. ఆ తరువాత ఆదం నుండి హవ్వాను పుట్టించాడు. తిరిగి వారిరువురి నుండి మానవ సంతతిని ఒక మిశ్రమ బంధువుతో ప్రపంచంలో వ్యాపింపజేశాడు. ఎంత గొప్ప నిర్మాత. ఎంత ప్రతిభాశాలి ఆయన! ఆయనే కొందరికి మగ సంతానం, కొందరికి ఆడసంతానం, మరి కొందరికి ఆడ, మగ సంతానం ప్రసాదిస్తున్నాడు. అలాగే కొందరిని సంతాన హీనులుగా చేశాడు. నిశ్చయంగా ఆయన సమస్త కార్యాలు చేయగల సమర్థుడు. గొప్ప జ్ఞాన సంపన్నుడు కూడాను.

ఆయనే మనకు చూడటానికి కళ్ళు, వినడానికి చెవులు, ఆలోచించడానికి హృదయాన్ని అనుగ్రహించాడు. ఎంత కరుణామయుడు ఆయన. భూమ్యాకాశాల నిక్షేపాలకు చెందిన తాళపుచెవులు ఆయన చేతులోనే ఉన్నాయి. తాను కోరినట్లు కొందరికి పుష్కలంగా మరి కొందరికి స్వల్పంగా ఉపాధినిస్తున్నాడు. ఆయన సర్వం ఎరిగిన వాడు. ఎవరికి ఎంత ఇవ్వాలి? ఎప్పటి వరకు ఇవ్వాలి? అంతా తెలిసినవాడు ఆయన. ఆయనే విశ్వసామ్రాజ్యాధిపతి. తాను తలచుకున్న వారికి రాజ్యాన్ని ప్రసాదిస్తాడు. తలచుకున్న వారి నుండి రాజ్యాన్ని ఊడ బెరుకుతాడు. అలాగే తాను కోరిన విధంగా కొందరికి గౌరవ ప్రతిష్టలు అనుగ్రహిస్తాడు. మరికొందరిని పరాభవం పాల్జేస్తాడు. నిస్సందేహంగా ఆయన నిర్ణయాలకు తిరుగులేదు.

ఆయనే వృద్ధ్యాప్యంలో దైవప్రవక్త ఇబ్రాహీం(అ)కు ఇస్మాయీల్, ఇస్‌హాఖ్(అ)ల వంటి ఉత్తమ సంతానాన్ని ప్రసాదించాడు. ఆయనే శీలవతి అయిన మర్యం(అ)కు యేసు వంటి పరిశుద్ధ బాలుడ్ని ఇచ్చి ఆ బాలుడ్ని జనుల కోసం ఒక సూచనగా చేసి, ఆ చంటి పిల్లవాడితో పలకరింపజేశాడు.

ఆ ప్రభువు ఆజ్ఞతో యేసు(అ) మట్టితో పక్షి ఆకారం గల బొమ్మ చేసి అందులో గాలి ఊదితే అది సజీవ పక్షిగా మారేది. పుట్టు గుడ్డిని, కుష్టురోగిని తాకితే నయం అయ్యేది. ఆప్రభువు ఆజ్ఞతోనే మృతుల్ని కూడా బ్రతికించేవాడు.

ఆ ప్రభువే సత్య తిరస్కారులు యేసు(అ)ను చంపడానికి కుట్ర పన్నితే తాను మరో యుక్తి పన్ని యేసును దుర్మార్గుల బారి నుండి రక్షించి తన దగ్గరకు రప్పించుకున్నాడు.

ఆ ప్రభువే అల్లాహ్. మహా శక్తిమంతుడు. సృష్టిప్రణాళికను రూపొందించి దాన్ని అమలు చేసేవాడు. సర్వాధికారి. సర్వోన్నతుడు. అద్భుత వివేకవంతుడు. రాజాధిరాజు. సంరక్షకుడు. పర్యవేక్షకుడు. శరణు నిచ్చేవాడు. శాంతిమయుడు. అనంత కరుణామయుడు. అపార దయామయుడు. గోచర అగోచర విషయాలన్నీ ఎరిగిన వాడు. హృదయాల్లో దాగిన రహస్యాలు సయితం తెలిసినవాడు. పరమ పవిత్రుడు. నిత్యజీవుడు. ఎన్నటికీ నిద్రించ నివాడు. కనీసం కునుకుపాట్లు పడనివాడు. ఎంతో ఉదార స్వభా వుడు. జరిగిన తప్పులపై కుమిలిపోతూ పశ్చాత్తాపంతో చేసిన వేడుకోలును స్వీకరించేవాడు. పాపాలు క్షమించేవాడు. తలబిరు సుతనంతో ప్రవర్తించే వారిని కఠినంగా శిక్ష ఇచ్చేవాడు. పరలోక విచారణ దినానికి అధిపతి. న్యాయాధిపతి. తీర్పు దినాన ఆయన సన్నిధిలో సిఫారసు చేయగల ధైర్యం ఎవరికీ ఉండదు. ఆయన మహోన్నతుడు. అయితే తన దాసులకు చేరువలోనే ఉంటాడు. మొర పెట్టుకునే వారి మొరలను ఆలకించి, సమాధానమిస్తాడు. జనులు చేస్తున్న పనులన్నిటినీ గమనించేవాడు. మెల్లగా మాట్లాడినా బిగ్గరగా మాట్లాడినా, రాత్రివేళ చీకటిలో దాగినా పగటి వెల్తు రులో తిరుగుతున్నా అంతా తెలిసినవాడు. వినేవాడు. ఆయన శుభదాయకుడు. పరమ పవిత్రుడు. ఆయన ఎవరి అవసరమూ అక్కరా లేని నిరపేక్షాపరుడు. ఆయనకు తల్లిదండ్రులూ లేరు. ఆయన ఎవరినీ తన కొడుకుగా చేసుకోలేదు. ఆయనకు సమానమైన వారు ఎవరూ లేరు. ఆయన సామ్రాజ్యం, సార్వభౌమత్వాలలో ఆయనకు ఎవరూ సాటిలేరు. యావత్తు సృష్టిలో ఆయన్ను పోలినది ఏదీ లేదు. ఎవరి చూపులూ ఆయన్ను అందుకో లేవు. భూమ్యాకాశాల్లో ఉన్న అణువణువూ అల్లాహ్ ఔన్నత్యం చాటుతూ, ఆయన పవిత్రతను ప్రశంసిస్తోంది. యావత్ నిశ్వసామ్రాజ్యం ఆయనదే. సకల స్తోత్రాలు,పొగడ్తలు ఆయనకే శోభిస్తాయి.

సకల లోకాలకు ఏకైక ప్రభువైన అల్లాహ్‌ను మొరపెట్టుకోవడమే ధర్మం. ఆయన్ను వదలి సృష్టితాలను మొరపెట్టుకోవడం మిథ్య. జనుల్లో కొందరు అల్లాహ్‌ను వదలి ప్రతిమలను ప్రార్థిస్తున్నారు. చూడబోతే నడవటానికి వాటికి సహజమైన కాళ్ళు లేవు. పట్టుకోవడానికి చేతులు లేవు. చూడటానికి కళ్ళు లేవు. వినడానికి చెవులు లేవు. సర్వోన్నతుడైన అల్లాహ్‌ను వదలి జనులు పూజిస్తున్న మిథ్యాదైవాలు అన్నీ కలసి కనీసం ఒక ఈగనైనా సృష్టించలేవు. అంతేకాదు ఈగ వాటి దగ్గర్నుంచి ఏదైనా వస్తువుని గుంజుకుంటే ఆ వస్తువుని కూడా అవి విడిపించుకోలేవు. యదార్థమేమిటంటే సహాయం అర్థించేవాడు. సహాయం అర్థించబడేవారు. ఇద్దరూ బలహీనులే.

సూర్యుడు చంద్రుడు అల్లాహ్ ఏకత్వానికి, ఆయన శక్తి సామర్థ్యాలకు నిదర్శనాలు మాత్రమే. వాటిని సాష్టాంగ పడకూడదు. వాటిని సృష్టించిన అల్లాహ్‌కే సాష్టాంగ పడాలి. అల్లాహ్‌ను వదలి ఎలాంటి లాభంగాని, నష్టంగాని కలిగించలేని, చంపే బ్రతికించే శక్తి లేని మిథ్యాదైవాలను ఆరాధించడం ఘోరమైన అపరాధం. క్షమించరాని నేరం. ఇది తెలిసి మసలుకున్నవారే ధన్యులు, ఇహపరాల్లో సఫలీకృతులూను.

## నిండు చంద్రుడే నిరతం నీ మోమై నిలిచే

అవనితలాన ఆప్యాయతలు కరువాయేనా ఈ
వింత నగర వాసులకు నీవు బరువాయేనా!?
కన్నులలో కరుణ కలువలు విరబూసే – నీ
వాక్కు వన్నెలలో వెన్నెలలే వాసముండే

కారుణ్యము నీ దేహంగా ఆకారము దాల్చే
గుణ శ్రేష్ఠము నీ జీవితంగా రూపు మారే
నిగనిగల నిర్మల తారకలే నీ నయనాలు కాగా
నిండు చంద్రుడే నీ ముందు వెలవెలబోయే

సిగ్గులు చెంపలందు మొగ్గలు తొడుగుచున్నవి
మమతల మల్లె తీగలు నీ కురులు అయినవి–నీ
పెదవులందు తేనియలే ఒదిగి వున్నవి–నీ
హృదయ సీమ దివ్యవాణి ఉనికి అయినది.

నిండు చంద్రుడే నిరతం నీ మోమై నిలిచే
నిన్నా వీరు హింసించినది ?
నింగీ నేలా నిర్మాతే నీ పక్షం వహించే
నిన్నా వీరు వెలివేసినది?

## అక్షరం

ముహమ్మద్ ఖాన్

మనుషులనే గాదు
అక్షరాల్ని సహితము గుర్తించలేకపోతున్న
మనుషులకన్నా
అక్షరాలను గుర్తుపట్టడం తేలిక
అక్షరం, తన ఆకారం మార్చుకో జాలదు
మార్చుకుంటే అది అక్షరం కానే కాదు.
స్వతహగా
మనిషి పుట్టుకలోనే ఒక స్వరూపం గల్లి
ఆకారంలో తప్పా పోలికల్లో మాత్రం
మరో వ్యక్తికి భిన్నంగా ఉంటాడు
అదే, సృష్టి రహస్యం
పశువుల్లో పోలికలలో మార్పుల్ని
కొంతవరకు గుర్తించ గలం
పక్షుల్లో అలా కాదే
పక్షులన్నీ ఒకే ఆకారంలో
మనల్ని విస్మయం కల్గిస్తాయి, కాని
వాటి జంటల్ని తేలిగ్గా వాటికవే గుర్తించి
మనల్ని ఇరుకులో పెట్టి వినోదం చూస్తాయి.
పక్షి తన జీవిత కాలం
ప్రకృతి వైపరిత్యాలు ఎన్నయినా ఎదుర్కొని
గాలిలో రెక్కలల్లాడిస్తూ
ముక్కులో మహోన్నత స్థాయిలో గూడు నిర్మించుకుని
జీవితం నెట్టుకు రాగలదు.
సమస్త ప్రపంచాన్ని తన రెక్కల్లో మడిచి విసరగలదు.
మరి నీవో,?

# ముస్లిం జీవితానికి సంబంధించిన ముఖ్యమైన ప్రశ్నలు

అనువాదం:
ముహమ్మద్ అజీజుర్రహ్మాన్



**ప్ర: ఒకవేళ (ఏదేని విషయంలో) మన మధ్య భేదాభిప్రాయం వస్తే మనం దేని వైపు మరలాలి?**

**జ:** భేదాభిప్రాయం వచ్చినపుడు మనం ఏకాగ్రచిత్తంతో మన ధర్మం (దీన్) వైపుకు మరలాలి. వ్యవహారాన్ని దైవ గ్రంథానికి, దైవ ప్రవక్త(స) విధానానికి అప్పగించాలి. దైవం మరియు ప్రవక్త (స) తీర్పును శిరసావహించాలి. ఎందుకంటే అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: **“ఒక వేళ ఏ విషయంలో నయినా మీ మధ్య వివాదం తలెత్తితే దానిని అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త వైపుకు మరల్చండి.”** ( అన్నిసా-59)

దైవ ప్రవక్త (స) ఇలా ప్రబోధించారు: “నేను మీ మధ్య రెండు వస్తువుల్ని వదలినాను. మీరు వాటిని పట్టుకుని ఉన్నంత కాలం దారి తప్పరు. అంటే (1) దైవగ్రంథం, (2) ఆయన ప్రవక్త సంప్రదాయం (సున్నత్)”. (ముఅత్తా ఇమామ్ మాలిక్ )

**ప్ర: తౌహీద్ (దేవుని ఏకత్వం) ఎన్ని రకాలు?**

**జ:** తౌహీద్ మూడు రకాలు -

(1) తౌహీదె రుబూబియత్:- అల్లాహ్‌ను, ఆయన కర్త, కర్మ, క్రియలలో-అంటే పుట్టించటంలో, పోషించటంలో, జీవన్మరణాలను ప్రసాదించటంలో ఒక్కడుగా భావించటం. అరబ్బు అవిశ్వాసులు కూడా మహా ప్రవక్త (స) ప్రభవనానికి పూర్వం ఈ తౌహీద్‌ను అంగీకరించేవారు.

(2) తౌహీదె ఉలూహియత్:- అంటే అల్లాహ్ ఆరాధనలో- ఉదాహరణకు:- నమాజ్, ఉపవాసం, దానధర్మాలు- ఇత్యాది కార్యాలలో కూడా అల్లాహ్‌ను సాటిలేని వాడుగా భావించటం. ఈ ఏకత్వాన్ని విడమరచి చెప్పటానికే ప్రవక్తలు పంపబడ్డారు. దైవ గ్రంథాలు అవతరింపజేయబడ్డాయి.

(3) తౌహీదె అస్మా వస్సిఫాత్:- అంటే అల్లాహ్‌కు ఏ ఏ పేర్లు, ఏ ఏ గుణాలు ఉన్నాయని ఆయన ప్రవక్త నిరూపించారో వాటిని ఖచ్చితంగా విశ్వసించాలి. అల్లాహ్ ఘనతకు తగ్గట్టుగా మరీ విశ్వసించాలి. ఆ పేర్లలో, గుణగణాలలో ఎలాంటి ప్రక్షిప్తాలకు, మార్పులు చేర్పులకు ఒడిగట్టకూడదు. వాటిని అర్థరహితంగా తీసుకోకూడదు. వాటి స్థితిని వర్ణించకూడదు. మనుషుల గుణగణాలతో వాటిని పోల్చటంగానీ, ఉపమానాలివ్వటం గానీ చేయకూడదు.

**ప్ర: ‘వలీ’ అని ఎవరినంటారు ?**

**జ:** సజ్జనులను, దైవభీతిపరులను, ధర్మనిష్ఠగల వారిని ‘వలీ’ అని అంటారు. వలీ అంటే ప్రియతముడు, మిత్రుడు, సన్నిహితుడు అని అసలు అర్థం. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: **“వినండి! అల్లాహ్ స్నేహితులకు భయముగానీ, దుఃఖంగానీ ఉండదు. వారు విశ్వసించిన వారై (చెడుల విషయంలో అల్లాహ్‌కు) భయపడేవారై ఉంటారు.”** (యూనుస్-62,63)

మహా ప్రవక్త(స) ఇలా వక్కాణించారు: “నా వలీ( నేస్తం) అల్లాహ్ మరియు సజ్జనులైన విశ్వాసులు”. (బుఖారీ, ముస్లిం)

**ప్ర: దైవప్రవక్త(స) గారి ప్రియసహచరుల (ర) విషయంలో మనం తప్పనిసరిగా చేయాల్సిందేమిటి?**

**జ:** ప్రవక్త(స)వారి సహాబా(ర)విషయంలో మన ప్రథమ కర్తవ్యం ఏమిటంటే, మనం వారిని ప్రేమించాలి, అల్లాహ్ వారి పట్ల ప్రసన్నుడవాలని దుఆ చేయాలి. వారి యెడల మన ఆంతర్యంలో నిష్కల్మషమైన అభిమానం ఉండాలి. వారి స్థాయికి తగినట్లుగానే వారిని ప్రస్తుతించాలి. వారిని గురించి అనాచితంగా ఆలోచించటం గానీ, అసమంజసంగా మాట్లాడటంగానీ తగదు. వారి గొప్పతనాన్ని సేవలను స్మరించుకుంటూ ఉండాలి. వారి మధ్యన గల విభేదాలను ప్రస్తావించి నోటికొచ్చినట్లు వ్యాఖ్యానించకూడదు. ప్రవక్త ప్రియ సహచరులు (ర) విమర్శకు అతీతులు, దోష రహితులైతే కారుగాని వారు **‘ముజ్‌తహిద్’**లు (ఇస్లామీయ షరీఅతును దైనందిన జీవితానికి అన్వయింపజేసే ప్రక్రియ లో నిస్వార్థపరులు, చిత్తశుద్ధి గలవారు.) వారి **‘ఇజ్తెహాద్’** (షరీయతు సూత్రాల అన్వయింపు ప్రక్రియ) సరైనది. తత్ఫలితంగా అల్లాహ్ వారికి రెట్టింపు పుణ్యఫలం ప్రసాదిస్తాడు. మరెవరయితే ఈ **‘అన్వయింపు’**లో పొరబడ్డారో వారికి కూడా ఒకింత పుణ్యఫలం లభిస్తుంది. వారి వల్ల జరిగిన పొరపాటు మన్నించబడుతుంది. ఎందుకంటే వారు సంకల్పశుద్ధి గల వారు గనక. ప్రవక్త ప్రియసహచరుల(సహాబా-ర)వల్ల ఏవైనా పొరపాట్లు జరిగినా వారి ఘనత, వారి అసాధారణ త్యాగాల మూలంగా అవి దూరం అవుతాయి. మహనీయ ముహమ్మద్(స) వారు తన ప్రియ సహచరుల గురించి ఏమంటున్నారు చూడండి:

**“నా సహవసులను తూలనాడకండి. ఎవరి అధీనంలో నా ప్రాణముందో ఆ శక్తిమంతుని సాక్షి! మీలో ఎవరయినా సరే ఉహద్ పర్వతానికి సమానంగా బంగారం ఖర్చు పెట్టినప్పటికీ వారు ఖర్చు పెట్టిన ‘ముద్’ (625గ్రాములు)కు, ముద్‌లో సగ భాగానికి కూడా సమానం కాజాలదు.”** (బుఖారీ, ముస్లిం)






# ‘నెలవంక’కు సంబంధించిన సర్వే

**నెలవంక ప్రారంభమై 6 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని ఐపిసి యాజమాన్యం భవిష్యత్ అధ్యయనం దృష్ట్యా ఓ సర్వే నిర్వహించగోరుచున్నది. ఈ సర్వే ప్రశ్నావళి ద్వారా వచ్చే పాఠక మహాశయుల అమూల్యమైన సూచనలు, విలువైన సలహాల ఆధారంగా నెలవంక పత్రికను మరింత శోభతో, మరిన్ని మెరుగులతో అందంగా పాఠక మహోదయుల వద్దకు తీసుకెళ్ళాలన్నది ఐపిసి ముఖ్యోద్దేశ్యం. క్రింద ఇవ్వబడిన ప్రశ్నావళిని నిశిత దృష్టితో చదివి సమాధానాలు వ్రాసి ఐపిసి సంపాదక వర్గానికి పంపగలరని ఆశిస్తున్నాము. మీ విలువైన సలహాలు, అమూల్యమైన సూచనలే నెలవంక పత్రిక భవిష్యత్తుకు దిశా నిర్దేశాలు కాగలవని తెలిజేస్తున్నందుకు సంతోషిస్తున్నాము.**

### మొదటి అక్షం: పత్రిక బహిర్గతం మేరకు

**మీకు పత్రిక పరిచయం ఎలా అయ్యింది?**

⊙ ఐపిసి బ్రాంచీల నుంచి ⊙ మీ నివాస స్థలం నుంచి ⊙ మీ కార్యాలయం నుంచి ⊙ ఇతర ప్రాంతాల నుంచి

**పత్రిక మీకు సులభంగా అందుతుందా?**

⊙ అవును ⊙ లేదు

### రెండవ అక్షం: సంపాదకీయం మరియు శీర్షికలు

**పత్రికలో వస్తున్న శీర్షికల గురించి మీ అభిప్రాయం?**

⊙ చాలా బాగున్నాయి ⊙ బాగున్నాయి ⊙ ఫర్వాలేదు

**ప్రవాసాంధ్రులకు సంబంధించి అంశాల్ని పత్రిక చర్చిస్తున్నదా?**

⊙ అవును ⊙ కాదు ⊙ అప్పుడప్పుడు

**పత్రికలో మీకు ఎక్కువగా నచ్చిన శీర్షికలు ఏవి?**

⊙ ధార్మికపరమైనవి ⊙ వార్తాపరమైనవి ⊙ వినోదపరమైనవి ⊙ విజ్ఞాన పరమైనవి ⊙ సామాజిక పరమైనవి ⊙ ఇతరములు..............

### మూడవ అక్షం: భాషా అనువాదం

**పత్రికలో ఉపయోగించబడుతున్న భాషాశైలి ఎలా ఉంది?**

⊙ సులభంగా ఉంది ⊙ వ్యవహారికమైనది ⊙ బాగా లేదు ⊙ కష్టతరమైనది

**పత్రికలోని వ్యాసాల గురించి మీ అభిప్రాయం?**

⊙ చాలా బాగున్నాయి ⊙ బాగున్నాయి ⊙ ఫర్వాలేదు

### నాల్గవ అక్షం: ఆకృతి మరియు అవుట్ ఫుట్

**పత్రిక సైజు మరియు పేజీల సంఖ్య ఎలా ఉంది?**

⊙ చాలా బాగుంది ⊙ బాగుంది కానీ మార్పు అవసరం ⊙ బాగా లేదు

**వ్యాసాల్లో తీసుకోబడుతున్న పోటోలు ఎలా ఉంటున్నాయి?**

⊙ సబ్జెక్ట్‌ను బట్టి ఉంటున్నాయి ⊙ బాగున్నాయి కాని మార్పు అవసరం ⊙ బాగాలేవు

**పత్రిక కవరు పేజీ డిజైన్ గురించి మీ అభిప్రాయం?**

⊙ చాలా బాగుంటుంది ⊙ బాగుంటుంది కాని మార్పు అవసరం ⊙ బాగుండటం లేదు.

### పెర్సనల్ డేటా

**లింగం:** ⊙ పురుడు ⊙ స్త్రీ

**వయసు:** ⊙ 16 నుండి 25 ⊙ 26 నుండి 35 ⊙ 36 నుండి 45 ⊙ 46కు పైన

**విద్యా స్థాయి:** ⊙ ప్రాథమిక స్థాయి ⊙ మధ్యంతర స్థాయి ⊙ హై సెకండరీ ⊙ డిగ్రీ

**మతం:** దాన్ని పేర్కొనండి

## మీ ఈ సహకారానికి కృతజ్ఞతలు!

- తాహెరా బేగం

## రుచి - అభిరుచి

# పాకశాల - కువైటీ వంటకాల పాఠశాల



కువైటి వంటకాలు మొదలు పెట్టుటకు ముందు కొన్ని మషాలాలు తయారు చేయు విధానాన్ని నేర్చుకొనుట మేలు. మార్కెట్టులో రెడిమేడ్‌గా దొరకని మషాలాలంటూ లేవు కానీ ఇంటిలో తయారు చేసికొనుట ఉత్తమం.

ఈ క్రింద ఇవ్వబడిన సామాగ్రితో రుచికరమైన వంటకాల తయారీలో తోడ్పడు మషాలాలు తయారు చేయు విధానము:

250 గ్రాములు నల్ల మిరియాల పొడి.
250 గ్రాములు ఎర్ర మిరపకాయలు.
250 గ్రాములు జీలకర్ర.
250 ధనియాలు.
250 గ్రాములు యాలకల తొక్కలు.
250 గ్రాములు యాలకలు.
100 గ్రాములు అల్లం.
100 గ్రాములు లవంగాలు.
100 గ్రాములు జావిత్రి ( నట్‌మెగ్)
250 దాసిని చెక్క.



### తయారు చేయు విధానము:

1- అన్ని మషాలాలను శుభ్ర పరచుకుని అంటే (రాళ్ళు ఏరి) యాలకలను వేరుగా పెట్టి ( ఒకవేళ యాలకలు కడిగితే వాటి రంగు మరియు వాసన పోతుంది కాబట్టి కడగ రాదు) అన్నింటిని నీటిలో కడగాలి.

2- కడిగిన మషాలాలన్నింటిని కలిపి ఎండలో ఆర పెట్టాలి.

3- అన్నింటిని కలిపి మెత్తగా గ్రైండ్ చేయాలి, ఆ పొడిని ఒక ప్లాస్టిక్ డబ్బాలో వేసి మూత గట్టిగా పెట్టాలి. దీని వలన మషాలాల యొక్క వాసన ఆవిరై పోదు.

పై మషాలాలు పూర్తివైనప్పటికి మరికొన్ని మషాలాలు అవసరము అవేమిటంటే :

పసుపు పొడి - నల్ల నిమ్మకాయల పొడి - దాసిన చెక్క - పూర్తి నల్లని ఎండు నిమ్మకాయ - కిష్‌మిష్ పండ్లు - చింత పండు - పప్పు వక్కలు - 100 గ్రాములు నట్‌మెగ్ - సాఫ్రాన్ - రోజ్ వాటరు.

### చక్కటి చిట్కాలు

ఏ ఆహార పదార్థాలనైనా గ్రడ్డులో ముంచి బ్రెడ్ క్రమ్స్‌లో చుట్టినపుడు వాటిని వదులుగా కాకుండా గట్టిగా మరియు అన్ని వైపులా సమంగా చుట్టాలి, ఇలా చేయుట వలన వేపే నూనె లేక నేతిలో క్రమ్స్ ముద్దలు పడి నూనె పాడయ్యే అవకాశం ఉండదు.

ఏవైనా పలకులు పిండి ముద్దలో కలుపునపుడు వాటిని పిండిలో కలపాలి. ముఖ్యంగా పల్చటి పిండిలో కలుపునపుడు!

అఖ్‌రోట్ పలకులు ముక్కలుగా తరుగుటకు ముందు దాని తొక్క తీసి ముక్కలుగా చేయాలి, వాటిని పిండిలో కలుపునపుడు కాస్త పెనుముపై రోస్టు చేసుకోవడం ఉత్తమం, ఇలా చేయటం వలన పదార్థాల్లో చక్కగా మిక్స్ అవుతాయి పాత్ర అడుగులో ఉండిపోతాయి.



# కువైటీ ప్రజల జీవన శైలి

ప్రవాసాంధ్రులకు

### గృహ ప్రతిష్ఠ:

కువైటీల గృహాలలో అపరిచితులకు యజమానులు లేని సమయంలో ప్రవేశానుమతి ఉండదు.

### సాప్తాహిక సమూహాలు:

తరతరాల నుండి పారంపర సాంప్రదాయాలు వారసత్వంగా పొందిన కువైటీలకు సాప్తాహిక సమూహాలను అనుసరించుట ప్రాణం. కుటుంబీకులతో ప్రతి వారం పరస్పరం కలుసుకొనుట మరియు బాంధవ్యాలను బలపరచుట వారికి ఇష్టం.

### వస్త్రధారణలో హుందాతనం:

కువైటీ స్త్రీలకు చక్కటి అందమైన వస్త్రధారణ పట్ల మక్కువ అధికం. వారు శరీర ఆకర్ష కనపడకుండా చీలికలు లేని వదులు మరియు దళసరి దుస్తులు ధరిస్తారు. వారు తలకు స్కార్ఫు కూడా తప్పనిసరిగా వేసుకుంటారు.

### భోజనం:

సాధారణంగా కువైటీ కుటుంబాలు, కుటుంబ సభ్యులందరూ కలిసి భుజించటానికి శాయశక్తుల ప్రయత్నిస్తారు.

### సంసారం:

ప్రాకృతికంగా భర్తే కుటుంబానికి యజమాని, ముఖ్య నిర్ణయాలకు అతనే బాధ్యుడు. నిర్ణయానికి ముందు అతను భార్య మరియు ఎదిగిన పిల్లలున్నచో వారితో సంప్రదించి అందరి సలహాలు తీసికొని నిర్ణయిస్తాడు.

### కుటుంబ సభ్యులు:

కువైటు కుటుంబము సాంప్రదాయకంగా ఉమ్మడి కుటుంబమే అంటే తండ్రి, తల్లి, తాత, నానమ్మ మరియు పిల్లలతో కూడి ఉంటుంది. ప్రతి కుటుంబంలో ఇలా ఉండడం తప్పనిసరి కాదు, కుటుంబ సభ్యులలో హెచ్చు తగ్గులు ఉంటాయి.

### నడవడిక:

కుటుంబీకులందరు మంచి నడవడికకు కట్టుబడి ఉండాలి. (ఇది వారి మధ్య ఉన్న బంధాన్ని బల పరుస్తుంది) ఉదాహరణకు పరస్పర నమ్మకం, సత్య సంధత, ఆదరణ ఒకరి కొకరు మంచి కార్యాలపై పరస్పర అభినందించుకోవడం, చిన్నారులపై వాత్సల్యము చూపించటం, ఇతరుల వ్యక్తిగత సొమ్మును భద్ర పరచటము, డబ్బును దుబారా చేయకుండా పొదుపుగా వాడడం, మృదువుగా మరియు మితంగా మాట్లాడటం వంటి అలవాట్లు.

### సంఘ జీవనం:

పరస్పరం జాలి, దయ మరియు కరుణ కలిగియుండి ఐకమత్యాన్ని పాటిస్తారు. ప్రతి కువైటీ కుటుంబీకులు ఒకరికొకరు అండగా ఉండి పరస్పర బాగోగులు చూసుకుంటుంటారు, కష్టనష్టాల్లో పాలుపంచుకుంటూ, తరుచుగా ఒకరినొకరు కలుసుకుంటూ ఉంటారు. అలాగే చుట్టు బంధువులతో మరియు ఇరుగు పొరుగు వారితో కూడా చక్కగా వ్యవహరిస్తూ ఉంటారు, వారిని తమ సంతోష దుఃఖాల్లో చేర్చుకుని కష్టాల్లో పెద్ద ఎత్తున సహాయాలు చేస్తుంటారు.

**నైతిక విలువలు:** కుటుంబ పెద్దలు ఎల్లప్పుడూ కుటుంబీకులలో ఇస్లామీయ ప్రధానాంశాలను మరియు ఇస్లామీయ సంస్కారాలను నూరిపోస్తూ, పునశ్చరణ చేస్తూ ఉంటాడు. కొన్ని ముఖ్య ఇస్లామీయ సంస్కారాలు క్రింద పేర్కొన బడినవి. అవి:

(అ) పిల్లలను తమతో పాటు నమాజు చేయుటకు మస్‌జిద్‌కు తీసుకు వెళ్ళడం.

(ఆ) శుభ ప్రదమైన రమజాను మాసములో ఉపవాసముండటం.

(ఇ) పండగలు మరియు ఇతర శుభప్రద సందర్భాల్లో పరస్పర శుభాకాంక్షలు తెలుపుకొనటం.



# ఐపిసి ఆధ్వర్యంలో 'ఈదుల్ అజ్హా'

ఐపిసి తెలుగు విభాగం ఆధ్వర్యంలో 06 - 11- 2011వ తేదీ ఆదివారం నాడు ఈదుల్ అజ్హా ప్రోగ్రాం విజయవంతంగా జరిగింది. తెలుగు ముస్లిం అసోసియేషన్ (టిఎమ్ఎ) అనుబంధంతో కువైట్ సిటీలోని మస్జిద్ అల్ హమద్‌లో జరిగిన ఈ ఉత్సవంలో 200 మంది స్త్రీపురుషులు, న్యూ ముస్లిం సోదరసోదరీమణులు పాల్గొని ప్రభువైన అల్లాహ్‌కు శ్రద్ధాభక్తుల నివాళి ఘటించారు. ఈ కార్యక్రమానికి వివిధ బ్రాంచీలకు చెందిన ధర్మ ప్రబోధకులు హాజరయ్యారు. నమాజ్ అనంతరం క్రీడా విన్యాసాలు జరిగాయి. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయటంలో తోడ్పడిన కార్యకర్తలందరికీ, ముఖ్యంగా టిఎంఎ టీమ్‌కు, ఐపిసి తెలుగు విభాగం కృతజ్ఞతలు తెలుపుకుంటోంది.








# ఐపిసి వఫ్రా బ్రాంచీ ఆధ్వర్యంలో రగ్గుల పంపిణి

ఎడారి చలి అనగానే అడవి పులి అంతటి భయం. ఈ అవసరాన్ని గుర్తించిన ప్రజాశ్రేయోభిలాషులైన కువైటీలు కొందరు ఐపిసి సహకారంతో మజ్రాల్లో, ఎడారిలో పని చేసే కార్మికుల్లో రగ్గులు పంచారు. తెలుగు సోదరుల్లో రగ్గులు పంచే బాధ్యత ఐపిసి వఫ్రా బ్రాంచీ ప్రబోధకులు షేక్ సలీమ్ ఉమ్రీగారు తీసుకున్నారు.







# ఐపిసి జహ్రా ఆధ్వర్యంలో 'విహారయాత్ర'

ఐపిసి తెలుగు విభాగం జహ్రా ఆధ్వర్యంలో తెలుగు సోదరులు 30 - 12 - 2011వ తేదీ శుక్రవారం నాడు జంతు ప్రదర్శనాశాలను సందర్శించుకున్నారు. ఈ యాత్ర సందర్భంగా 'భారతీయ గ్రంథాల్లో ముహమ్మద్ (స)' అన్న అంశంపై సోదరులు నాయక్ ప్రసంగించగా, 'ధర్మ పరిచయం' అన్న అంశంపై తెలుగు ప్రబోధకుల మౌలానా సయ్యిద్ అహ్మద్ గారు సంభాషించారు. హాజరైన సోదరులందరూ ఐపిసి యాజమన్యానికి కృతజ్ఞతలు తెలుపుకున్నారు.








# విజేతలకు సన్మానం

నవముస్లిం మరియు ముస్లిమేతరుల కోసం జరిగిన రమజాన్ పోటీల బహు మతి కార్యక్రమం 13/12/2011 తేదీన ఐపిసి ఆసిమ బ్రాంచ్‌లో జరిగింది. ముసాఇద్ అల్ ఎనజి అందరిని స్వాగతించారు, షేక్ సిఫాత్ తైమీ గారు హిందీ భాషలో సూరతుల్ ఇఖ్లాస్ యొక్క భావం మరియు నిజమైన సృష్టికర్త ఎవరన్న విషయాన్ని తెలియజేసి ఇస్లాం ధర్మమే నిజ ధర్మమని ప్రసంగించారు. షేక్ హబీబుర్రహ్మాన్ తెలుగులో మనం ఎక్కడ నుంచి వచ్చాము, మన సృష్టికర్త ఎవరు? అనే సందేశాన్ని అందించి తెలుగు సోదరులందరినీ కృతజ్ఞతలు తెలిపి ప్రతి సంవత్సరం ఐపిసి పోటీలలో పాల్గొనటం కోసం ఆహ్వానించారు.

**బహుమతి పొందిన ముస్లిమేతరులు:**
తొలి బహుమతి : జి రామరాజు (60) దినార్లు
రెండవ బహుమతి: బాలరాజు ప్రతాప్ రాజు. (50) దినార్లు
మూడవ బహుమతి: బందారు నరేష్: (40) దినార్లు.
**నవముస్లింలు :**
తొలి బహుమతి: రాజశేఖర్ (ఉమర్) 60 దినార్లు
రెండవ బహుమతి: యస్ శ్రీనివాస్ (హుసేన్) 50 దినార్లు
మూడవ బహుమతి: బి రమేష్ బాబు (బిలాల్) 40 దినార్లు





## మీరూ విజేత కాగలరు..!

(పేజీ 9 మిగతా భాగం)

## 2 - మీరు విజేతలేనా.....?



ఇది ఒక పరీక్షకన్నా ఘనపాటిది. జవాబివ్వక ముందు బాగా చదివి అర్ధం చేసుకోండి. జవాబిచ్చే విషయంలో మీ ఆత్మే మీకు ప్రత్యక్ష సాక్షి! ఏది వ్రాసినా ఆత్మ సాక్షితోటి వ్రాయండి.

| రంగం | ప్రవర్తన | ఎల్లప్పుడు / | అప్పుడప్పుడు / | ఎప్పుడూ లేదు. |
|---|---|---|---|---|
| అల్లాహ్‌తో | ( అ ) గుర్తు చేసుకుంటాను | | | |
| | ( ఆ) మరువను | | | |
| | ( ఇ) కలవాలన్న కుతుహాలం | | | |
| ఆత్మతో | (అ)ఆందోళన లేకుండా | | | |
| | (ఆ)విమర్శ పరశీలన | | | |
| | (ఇ) ఆత్మ పరిశీలన సమర్ధించుకోవటం. | | | |
| తల్లిదండ్రులతో | (అ) విధి నిర్వాహణ | | | |
| | ( ఆ) సత్ప్రవర్తన | | | |
| | ( ఇ) ఉపకారం | | | |
| దాంపత్యం | (అ) ఏదో తోసుకెళ్తున్నాం | | | |
| | (ఆ) పరస్పర కరుణ,దయ,జాలి. | | | |
| | (ఇ) పరస్పర ప్రేమాభిమానాలు. | | | |
| సంతానంతో | (అ) సపోర్ట్ సమర్ధించుట | | | |
| | (ఆ) దిశ నిర్దేశం. | | | |
| | (ఇ) గాలికి వదిలెయ్యడం. శిక్షణారాహిత్యం. | | | |
| బంధువులతో | (అ) కేవలం గుర్తు చేసుకుంటాను. | | | |
| | (ఆ) కేవలం వారితో కలిసి వుంటాను. | | | |
| | (ఇ) వారితో మంచిగా ప్రవర్తిస్తాను. | | | |
| స్నేహితులతో | (అ) స్వార్థం | | | |
| | (ఆ) పరస్పర సహకారం శ్రేయం | | | |
| | (ఇ) జస్ట్ టైమ్ పాస్ | | | |
| పనితో | (అ) కర్తవ్యాన్ని నెరవేరుస్తాను. | | | |
| | (ఆ) పనీ చేస్తాను. సహాయపడతానుకూడా | | | |
| | (ఇ) పనిలో ఆనందాన్ని ఆస్వాదిస్తాను | | | |
| తోటి కార్మికులతో | (అ) రస్సా కషీ | | | |
| | (ఆ) ఏదో కలిసి వున్నాం | | | |
| | (ఇ) నిజమైన మిత్రుత్వం | | | |
| అధికారులతో | (అ) నాపనేదో నేను చేసుకుంటాను. | | | |
| | (ఆ) అవసరం అన్పిస్తే సలహా ఇస్తాను. హితవూ చెప్తాను. | | | |
| | (ఇ) వారితో కలిసి వుంటాను. | | | |
| ప్రతిభావంతులతో | (అ) మంచిగా వ్యవహరిస్తాను | | | |
| | (ఆ) ఆదర్శంగా తీసుకుంటాను | | | |
| | (ఇ) శ్రేయోభిలాషిగా మసలుకుంటాను. | | | |
| సమయంతో | (అ) తప్పించుకు తిరిగే యత్నం | | | |
| | (ఆ) మధ్యే మార్గం | | | |
| | (ఇ) అత్యవసరమైన వాటికి ప్రాధాన్యత | | | |



## అవాకులూ చవాకులు

ముహమ్మద్ ఖాన్

అవాకులు చవాకులు
మనిషిని ఆకాశానికెత్తి
అదే స్థాయిలో నేలకేసి కొడ్తాయి.
మన బలహీనతో, దౌర్భాగ్యమో తెలీదు గాని
మన గొప్పదనాన్ని పొగిడినప్పుడల్లా
ఇక చూస్కో, నా అంతటి మగాడు ఈ భూమిపై
లేనేలేడని, విర్రవీగుతూ, నభూతే న భవిష్యత్తుగా
కళ్ళనెత్తినెట్టుకుని నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తాము
మన రహస్యాల్ని, బలహీనతల్ని కొల్లగొట్టేందుకు
మనపై కొందరు ప్రయోగ సిద్ధముగా
ఏవో నిలకడలేని పదజాలాన్ని ప్రయోగించి
మన స్పందన కోసం వేచి చూచి
ఒక కహానీ చెప్పేందుకు సిద్ధంగా ఉంటారు.
మనం ఇవేమి పట్టించుకోక, గమనించక
మన సహజ ధోరణిలో ప్రతిస్పందిస్తూ
నోటికీ,కాటికీ వచ్చినట్లు ఏవేవో
కోతలలో సహ ధారాళంగా ప్రసంగించి
చప్పట్లు కొట్టించుకుని, మరీ కొంపకు చేరతాము
చూచి చూడక, వినీ వినకో
పోనిలే, ఏదో తెల్సోతెలికో వాగాడనుకుని
మనం సరిబెట్టుకుని మౌనంగా నిష్క్రమిస్తాము.
ఆ ఒక్క అపవాదు
కాకి రెట్టలోని మర్రి విత్తనమై
సామ్రాజ్య బురుజులలో తిష్టవేసి, మొక్కయి
మ్రానయి, మహావృక్షమయి
మన సామ్రాజ్యాన్ని కూకటి వ్రేళ్ళతో పెకలించి కబళిస్తుంది.

## తేనెటీగ - తూనీగ



అనగనగా ఓ తెల్లని తూనీగ తమ మిత్రురాలైన తేనెటీగతో కలిసి అందమైన అడవుల్లో ఆడుతూ పాడుతూ నివసిస్తూ వుండేది. ఒక రోజు తూనీగ మరియు తేనెటీగలిద్దరూ హాయిగా తిరిగి వద్దామని మరో అడవి వైపునకు బయలు దేరి వెళ్ళారు. అక్కడికి చేరగానే ఒక పెద్ద యంత్రం ఆ అడవిలోని పూలను చెట్లను కూల్చివేయటాన్ని చూచి తూనీగ దుఃఖంతో ఎందుకు మానవులు పూలను మరియు చెట్లను నరికేస్తుంటారు? వాస్తవానికి వారు చెట్లను పూల తోటలను పెంచాల్సిందిపోయి ఇలా ప్రవర్తిస్తారెందుకు? చెట్ల వల్ల మాకు ఇతర జీవరాసులకు ఎంత లాభం చేకూరుతుందో వారికి తెలియదా? అని ఆవేదన చెందసాగింది.

తేనెటీగ తమ మిత్రురాలికి సమాధానమిస్తూ ఇలా చెప్పింది. మానవుడు అల్లాహ్ ప్రసాదించిన ఈ అనుగ్రహాన్ని సద్వినియోగం చేసుకోవట్లేదు వాటి విలువను గ్రహించుట లేదు. మేము తేనెటీగలము పూల చెట్లలోని తేనెను మానవుని కొరకు జమా చేస్తాము మరి పూల చెట్లే లేకపోతే మేము తేనె ఎక్కడి నుండి తీసుకొస్తాము?

ఇంతలోనే తూనీగ మాట అందుకొని అవును అసలు పూలు లేకుండా మేము బ్రతికేది ఎలాగా? ఎందుకు మానవుని ప్రవర్తన ఇలా దిగజారుతుంది. అవునులే ఈ మానవుడు చాలా స్వార్ధపరుడు వేరేవారి గురించి అస్సలు పట్టించుకోడు అని చెప్పింది.

సరే మిత్రమా! పద మనము మానవులు చేరుకోలేనటువంటి అడవుల వైపు వెళ్ళి పోదాం అంటూ తేనెటీగ, తూనీగను తన వెంట పిలుచుకొని తుర్రున ఎగిరి వెళ్ళిపోయింది.

| ప్రవర్తన | ఎల్లప్పుడూ | అప్పుడప్పుడు | ఎప్పుడు లేదు |
|---|---|---|---|
| అ | 2 | 1 | 0 |
| ఆ | 5 | 4 | 3 |
| ఇ | 8 | 7 | 6 |

రెడీ! స్టార్ట్ .....నౌ

36 కన్నా తక్కువుంటే- విచిత్రం! మిమ్మల్ని మీరు లక్కీగా భావిస్తూ భ్రమిస్తున్నారు.

37-72 వరకు- మేలుకోండి, తొందర చెయ్యండి- లేకుంటే సౌభాగ్యం, విజయం అనే రైలు బండి తప్పిపోతుంది

73-108 వరకు, మీరు విజయానికి ఒటమికి మధ్య కొట్టుమిట్టాడుతున్నారు.

109-144, మీరు విజేతలే. కాని మీలో ఏదో లోపం, ఆలోచన ఉంది. అయినా మీరు ప్రయత్నిస్తున్నారు.

145-180 వరకు, ప్రస్తుతం మీరున్న స్థితి ఎంతో గొప్పది. లోకులు ఏమనుకున్నా మీరు మాత్రం స్థయిర్యం కలిగి ఉండండి.

181-216 వరకు, విసుగు చెందిన జీవితం, నిలువ నీరై ఉన్న విజయం.

చీకటిని చూసి కళ్ళు మూయకోయ్ - నక్షత్రాలు కనబడే వేళ అది, వెలుగుని చూసి వెనుదిరగకోయ్- సత్యం స్నేహ హస్తం సాచే సమయమది. గమ్యం వైపు అడువేస్తూ-దూరాన్ని చూసి భయపడకోయ్.స్వర్గానికి చేర్చే దారి అది - దైవ దర్శనంతో పునీతమయ్యే మార్గం అది.

**విష్ యు ఆల్ ది బెస్ట్ ఆఫ్ లక్**

# నెలవంక ఉత్తరాలు

## కొన్ని పదాలు అభ్యంతరకరంగా ఉన్నాయి

అస్సలాము అలైకుమ్ వ రహ్మతు ల్లాహి వ బరకాతుహు. గౌరనీయులైన నెలవంక సంపాదకుల వారికి, సార్! **నెలవంక** డిశంబరు 2011 సంచికలోని ఇదియే ఇస్లాం, మార్పు-తీర్పు, రక్తం-జీవాన్నిచ్చే ద్రవం, పరలోక ప్రయాణం-2, కారుణ్యమూర్తి కంట కన్నీరొలికిన వేళ, ఎవరు బాధ్యులు?, నేటి బాలలే రేపటి పౌరులు, చీకటి నుండి వెలుతురు వరకు, ఇస్లామీయ క్యాలెండర్ - వ్యాసాలు చాలా బాగున్నాయి.

'పరలోక ప్రయాణం'లో ముహ మ్మద్ అజీజుర్రహ్మాన్ గారు పరలోకం గురించి పాఠకులకు తెలియని ఎన్నో విషయాలను తెలియజేస్తున్నారు. ధన్యవాదాలు. 'కారుణ్యమూర్తి కంట కన్నీరొలికిన వేళ' వ్యాసాన్ని చదివి కన్నీరాపుకోలేకపోయాను. ఆడపిల్లలను సజీవంగా పాతి పెట్టే పాషాణులను సయితం, ఆడ శిశువు పుడితే కారుణ్యంగా, శుభంగా భావించి సంతోషంతో సంబరాలు జరుపుకునే ఉత్తమ తండ్రులుగా మార్చగలిగిన ఏకైక ధర్మం 'ఇస్లాం'. ఎవరు బాధ్యులు? కూడా హృదయాన్ని కలచివేసింది. ఎందరో యవతీ యవకులు మత్తు పదార్థాలకు అలవాటు పడి తమ జీవితాలను సర్వనాశనం చేసుకోవడమే కాకుండా తమ తల్లిదండ్రులకు, బంధుమిత్రులకు తీరని బాధను మిగుల్చుతున్నారు. ఇంకా మానవ సమాజాన్ని కలుషితం చేస్తున్నారు. కాబట్టి ఇటువంటి సామాజిక రుగ్మతలపై మరిన్ని వ్యాసాలు రావాలని కోరుకుంటున్నాను. అందుకే సర్వ సృష్టికి రక్షణ ఇచ్చే ఇస్లాం ధర్మం 'మత్తు కలిగించే ప్రతి వస్తువును నిషేధించింది. 'నేటి బాలలే రేపటి పౌరులు'లోని పొడుపు కథలు చాలా బాగున్నాయి. పిల్లల్లో విజ్ఞానాన్ని పెంపొందింపజేస్తాయి.

ఇంకో ముఖ్య విషయమేమిటంటే, ఈ సంచికలో 'పగటి కల - పగిలిన తల' వ్యాసాన్ని ముహమ్మద్ హుసైన్ బొర్రా గారు చక్కటి తెలుగు భాషలో వ్రాశారు. ఇంతకు మునుపు కూడా మంచి, మంచి వ్యాసాలు అందించారు. కానీ, ఈ వ్యాసంలో కొన్ని పదాలు అభ్యంతరకరంగా ఉన్నాయి. అవి - 1) పలకరా పెళ్ళి కొడకా అంటే పెళ్లికూతురు ముండేది. 2) అంత పెద్ద దెబ్బ ఎలా తగిలిందిరా భడవా 3) ఈ వయసులో కూడా క్రికెట్ అడట మేంట్రా అట్లవెధవా? 4) నా కుక్క చింతకాయ 5) కనీసం నూనూగు మీసాల నూత్న యవ్వనమందు నేను ప్రేమిమచిన ఫజ్జో అయినా కనిపిస్తే బాగుండనిపించింది. 6) పండుగ నాడు కూడా పాత మొగుడేనా నాకు కొత్తదనం కావాలి. 7) గుండమ్మ కథలో ఎన్‌టిఆర్‌లా నిజం చెప్పమన్నావా, అబద్ధంచెప్పమన్నావా.

రచయిత గారి ఉద్దేశ్యం ఈ వ్యాసం ద్వారా పాఠకులను నవ్వించాలన్నదే అయితే ఇటువంటి పదాల అవసరం లేకుండానే పరిశుద్ధమైన పదాలతోనే పాఠకులను నవ్వించొచ్చు. సార్! పాఠకులు **నెలవంక**ను ఒక ధార్మిక, సామాజిక, సంస్కరణ మాస పత్రిక అని తలుస్తూ గౌరవభావంతో చదువుతారు. ఇంకా దానిని ఎత్తి పెట్టుకుంటారు. దయచేసి ఇటువంటి పదాలతో కూడిన వ్యాసాలు '**నెలవంక**' వంటి నిర్మాణాత్మకమైన పత్రికలో రాకుండా చూస్తారని విన్నవించుకుంటున్నాను.

ఇట్లు
మీ సోదరుడు
షేక్ రియాజ్



**మనవి:**

'విశ్వాసి మరో విశ్వాసికి అద్దం లాంటి వాడు' అని ప్రవక్త (స) చెప్పి ఉన్నారు. రచయిత ఎవరైనా చివరి బాధ్యత మాత్రం ఎడిటర్‌దే. రొటీన్‌కు భిన్నంగా ఉండాలన్న ఉద్దేశ్యంలో జరిగిన పొరపాట్లను ఎత్తి చూపినందుకు కృతజ్ఞతలు! మీ వంటి శ్రేయోభిలాషులు **నెలవంక**కు ఎంతో అవసరం. ఇటువంటి పొరపాట్లు ఇన్షాఅల్లాహ్ ఇకమీదట జరగవని మాట ఇస్తున్నాము. అలాగే పాఠక మహోదయుల నుండి నెలవంక పత్రికను మరింత మంచిగా మలిచే సలహాలను కోరుతున్నాము. - ఎడిటర్



# కాలాశ్వానికి కళ్ళెం వెయ్యి...!

ఇంకొద్ది గంటల్లో అరుణోదయ కిరణాలు
అవనీతలంపై నాట్యమాడుతాయి.
రేపటి సూర్యోదయం కొత్త వెలుగులు
తీసుకురాబోతోంది.
మనం వ్రాసుకునే మన జీవిత పుస్తకంలో కొత్త
అధ్యాయం చోటు చేసుకోబోతోంది.
జీవన పయనంలో జరిగిన పొరపాట్లను సరి
చేసుకొని, నగుబాట్లను తగుబాటగా
దిద్దుకొంటే గమ్యం చేర్చడానికి కొత్త మలుపు
సిద్ధంగా ఉంది.
రేపు మనంవేసే తొలి అడుగుకు చీకటి తెర
తొలగనుంది.
గతాన్నుండి గుణపాఠం నేర్చుకుని
వర్తమానంలో ఎలా జీవించాలో, భవిష్యత్తు
ప్రణాళికను ఎలా తయారు చేసుకోవాలో
మననం చేసుకోవాలి మనం.
కొత్త సవాళ్లు, కొత్త పరిచయాలు, కొత్త
అనుభవాలు మన జీవితంలో చోటు
చేసుకోబోతున్నాయి.
కన్న కలలు నిజమై కొత్త వెలుగొచ్చిన కళ్ళు, ఆ
కళ్ళలోనే మళ్ళి కొత్త కలలు. ఆ కలల్ని సాకారం
చేసుకునేందుకు మరో నూతవ సంవత్సరం
మన ముంగిట వచ్చి వాలింది.
ఆ అందమైన రేపటి సుందర రూపుకు నేడే
శ్రీకారం చుట్టాలి మనం.
కాలాశ్వాన్ని ప్రణాళికల కళ్ళెంతో కట్టడి చేసి
దృఢ నిశ్చయంతో మనముందున్న తమస్సు
తెరలను చీల్చి విజయాన్ని పాదాకాంత్రం
చేసేందుకు వెలుగు రేఖలు శర వేగంతో
వస్తున్నాయి. అందుకోండి..!
ఎంతటి సుదీర్ఘ ప్రయాణమైనా మొదటి
అడుగుతోనే ప్రారంభమవుతుంది.
నూతనోత్తేజాన్ని గుండెల నిండా నింపుకుని
నూతనోత్సాహంతో నడుం కట్టి పిడికిలి
బిగించి భావి తరాలకు బాట చూపేలా
ముందడుగు వేయండి...!!



# 2012

## January

| SU | MO | TU | WE | TH | FR | SA |
|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 |
| 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 15 | 16 | 17 | 18 | 19 | 20 | 21 |
| 22 | 23 | 24 | 25 | 26 | 27 | 28 |
| 29 | 30 | 31 | | | | |

## February

| SU | MO | TU | WE | TH | FR | SA |
|---|---|---|---|---|---|---|
| | | | 1 | 2 | 3 | 4 |
| 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 |
| 12 | 13 | 14 | 15 | 16 | 17 | 18 |
| 19 | 20 | 21 | 22 | 23 | 24 | 25 |
| 26 | 27 | 28 | 29 | | | |

## March

| SU | MO | TU | WE | TH | FR | SA |
|---|---|---|---|---|---|---|
| | | | | 1 | 2 | 3 |
| 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 |
| 11 | 12 | 13 | 14 | 15 | 16 | 17 |
| 18 | 19 | 20 | 21 | 22 | 23 | 24 |
| 25 | 26 | 27 | 28 | 29 | 30 | 31 |

## April

| SU | MO | TU | WE | TH | FR | SA |
|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 |
| 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 15 | 16 | 17 | 18 | 19 | 20 | 21 |
| 22 | 23 | 24 | 25 | 26 | 27 | 28 |
| 29 | 30 | | | | | |

## May

| SU | MO | TU | WE | TH | FR | SA |
|---|---|---|---|---|---|---|
| | | 1 | 2 | 3 | 4 | 5 |
| 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 |
| 13 | 14 | 15 | 16 | 17 | 18 | 19 |
| 20 | 21 | 22 | 23 | 24 | 25 | 26 |
| 27 | 28 | 29 | 30 | 31 | | |

## June

| SU | MO | TU | WE | TH | FR | SA |
|---|---|---|---|---|---|---|
| | | | | | 1 | 2 |
| 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 |
| 10 | 11 | 12 | 13 | 14 | 15 | 16 |
| 17 | 18 | 19 | 20 | 21 | 22 | 23 |
| 24 | 25 | 26 | 27 | 28 | 29 | 30 |

## July

| SU | MO | TU | WE | TH | FR | SA |
|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 |
| 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 15 | 16 | 17 | 18 | 19 | 20 | 21 |
| 22 | 23 | 24 | 25 | 26 | 27 | 28 |
| 29 | 30 | 31 | | | | |

## August

| SU | MO | TU | WE | TH | FR | SA |
|---|---|---|---|---|---|---|
| | | | 1 | 2 | 3 | 4 |
| 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 |
| 12 | 13 | 14 | 15 | 16 | 17 | 18 |
| 19 | 20 | 21 | 22 | 23 | 24 | 25 |
| 26 | 27 | 28 | 29 | 30 | 31 | |

## September

| SU | MO | TU | WE | TH | FR | SA |
|---|---|---|---|---|---|---|
| | | | | | | 1 |
| 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 |
| 9 | 10 | 11 | 12 | 13 | 14 | 15 |
| 16 | 17 | 18 | 19 | 20 | 21 | 22 |
| 23 | 24 | 25 | 26 | 27 | 28 | 29 |
| 30 | | | | | | |

## October

| SU | MO | TU | WE | TH | FR | SA |
|---|---|---|---|---|---|---|
| | 1 | 2 | 3 | 4 | 5 | 6 |
| 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 |
| 14 | 15 | 16 | 17 | 18 | 19 | 20 |
| 21 | 22 | 23 | 24 | 25 | 26 | 27 |
| 28 | 29 | 30 | 31 | | | |

## November

| SU | MO | TU | WE | TH | FR | SA |
|---|---|---|---|---|---|---|
| | | | | 1 | 2 | 3 |
| 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 |
| 11 | 12 | 13 | 14 | 15 | 16 | 17 |
| 18 | 19 | 20 | 21 | 22 | 23 | 24 |
| 25 | 26 | 27 | 28 | 29 | 30 | |

## December

| SU | MO | TU | WE | TH | FR | SA |
|---|---|---|---|---|---|---|
| | | | | | | 1 |
| 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 |
| 9 | 10 | 11 | 12 | 13 | 14 | 15 |
| 16 | 17 | 18 | 19 | 20 | 21 | 22 |
| 23 | 24 | 25 | 26 | 27 | 28 | 29 |
| 30 | 31 | | | | | |